


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు



విద్యార్థి ప్రయోజనాలే లక్ష్యంగా ఉన్నత విద్య ప్రక్షాళన: లోకేష్

4

# ఏపీకి కేంద్రం ఊపిరి

- కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులపై సీఎం చంద్రబాబు
- వికసిత్ భారత్‌కు కేంద్ర బడ్జెట్‌తో బాటలేశారని వ్యాఖ్య
- వైసీపీ పాలనతో ఏపీ 30యేళ్లు వెనక్కి..
- ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్నాం..
- 15శాతం వృద్ధి రేటు కూటమి లక్ష్యం
- అపరిశుభ్రతే...ఢిల్లీకి మైనస్
- పాలనా వైఫల్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి
- బీజేపీ గెలుపుతోనే అభివృద్ధి, సంక్షేమం
- ఢిల్లీ మీడియాతో ఏపీ సీఎం చంద్రబాబు

2



*'వికసిత్ భారత్ -2047 లక్ష్యానికి కేంద్ర బడ్జెట్ బాటలేస్తోంది. వెంటిలేటర్‌పైవున్న ఏపీకి ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆక్సిజన్ అందిస్తోందన్న విషయం -కేంద్రబడ్జెట్‌లో మన రాష్ట్రానికి చేసిన కేటాయింపులు చూసి చెప్పొచ్చు. కేంద్రం అందిస్తున్న ఆర్థిక చేయూతతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే మా ముందున్న లక్ష్యం. ఇప్పటికే ప్రపంచమంతా మన దేశంవైపు చూస్తోంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ఆవిష్కృతం కావడం ఖాయం'*

## గట్టెక్కించండి

"దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీకి తక్కువ జీడీపీ ఉంది. ఐదేళ్ల దుష్పరిపాలనతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. ఏపీ ఆర్థిక స్థితి దారుణంగా ఉందని.. అప్పులు తిరిగి చెల్లించే స్థితిలో లేదని నీతిఆయోగ్ సైతం స్పష్టం చేస్తోంది. గత ఐదేళ్లలో రూ.10లక్షల కోట్ల అప్పులు తెచ్చారు. రూ.లక్షన్నర కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. అందుకే -ఏపీని ఆర్థికంగా గట్టెక్కించే చర్యలకు సహకరించండి'

16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగరియాతో ఏపీ సీఎం చంద్రబాబు



2

## ఏపీకి భారీగా నిధులు



*రైల్వే బడ్జెట్‌లో ఏపీకి రికార్డుస్థాయి కేటాయింపులు జరిగాయి. రైల్వే అభివృద్ధికి రూ.9,417 కోట్లు కేటాయించాం. ఏపీలో 73 స్టేషన్ల రూపురేఖలు మారుస్తున్నాం. ఏపీకి మరిన్ని నమోభారత్, వందేభారత్ రైళ్లు కేటాయిస్తాం. ప్రాజెక్టులకు సహకరిస్తున్న సీఎం చంద్రబాబుకిధన్యవాదాలు*

**-కేంద్రమంత్రి అశ్వినీవైష్ణవ్**

4



## ఐక్యంగా పోటీ పడదాం

- విద్యావ్యవస్థ బలోపేతమే మన లక్ష్యం
- ప్రయివేట్ పాఠశాలల గుర్తింపు గడువు పదేళ్లకు పెంచుతాం
- అసోసియేషన్ ప్రతినిధులతో భేటీలో మంత్రి నారా లోకేష్
- యాజమాన్యాల సమస్యలు పరిష్కరిస్తానని హామీ

5

## నాణ్యతపై ఫోకస్ పెట్టండి

- ఇంజనీరింగ్ విద్యపై మంత్రి లోకేష్ విజ్ఞప్తి
- చర్చలు, సంప్రతింపులతోనే విధాన నిర్ణయాలు
- ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలతో మంత్రి భేటీ
- రీయింబర్స్‌మెంట్ సొమ్ము విడుదలకు యాజమాన్యాల వినతి

5

## 'సూద్'కు అభినందనలు

'ఈరోజు నటుడు సోనూసూద్‌ను కలవడం ఆనందంగా ఉంది. సూద్ ఫౌండేషన్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు నాలుగు అంబులెన్స్‌లు ఉదారంగా విరాళంగా అందించినందుకు ఆయనకు ధన్యవాదాలు. సూద్ ప్రశంసనీయమైన చొరవ ఆరోగ్య సంరక్షణా సేవలను బలోపేతం చేస్తుంది. మారుమూల ప్రాంతాలలో సకాలంలో వైద్య సంరక్షణను అందిస్తుంది. కమ్యూనిటీలకు సేవ చేయడానికి ఆయన చేస్తున్న గొప్ప ప్రయత్నాలలో విజయాన్ని కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నాను'

-నారా చంద్రబాబు నాయుడు



2

## రథ సప్తమికి తితిదే సిద్ధం

- సీసీ కెమెరాలతో నిరంతర నిఘా
- మాడవీధుల్లో టీటీడీ ఈవో, అదనపు ఈవో ఏర్పాట్ల పరిశీలన
- టీటీడీ కల్పించిన సౌకర్యాలపై భక్తుల సంతృప్తి




6



3

## మీ విజయం.. భావితరాలకు స్ఫూర్తి

*ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడల్లో 87 కిలోల విభాగంలో విజయనగరం బిడ్డ సత్యజ్యోతి కాంస్య పతకం సాధించడం పట్ల సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ అభినందనలు తెలిపారు. ఆమెలాంటి మహిళలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తున్నారని కొనియాడారు.*



## అలసత్వం సహించను

- ప్రభుత్వ పథకాల పక్కా అమలుకు నిరంతర అభిప్రాయ సేకరణ
- ఐవీఆర్ఎస్ ఫలితాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

3

చైతన్యరథం

# ఏపీకి కేంద్రం ఊపిరి

## కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులపై సీఎం చంద్రబాబు

- వికసిత్ భారత్‌కు కేంద్ర బడ్జెట్‌తో బాటలేశారని వ్యాఖ్య
- వైసీపీ పాలనతో ఏపీ 30యేళ్లు వెనక్కి..
- ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్నాం..
- 15శాతం వృద్ధి రేటు కూటమి లక్ష్యం
- అపరిశుభ్రతే... ఢిల్లీకి మైనస్
- పాలనా వైఫల్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి
- బీజేపీ గెలుపుతోనే అభివృద్ధి, సంక్షేమం
- ఢిల్లీ మీడియాతో ఏపీ సీఎం చంద్రబాబు



న్యూఢిల్లీ (చైతన్యరథం): వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని చేరుకునేలా కేంద్ర బడ్జెట్ ఉందని, వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆక్సిజన్ అందించేలా బడ్జెట్‌లో ఏపీకి నిధులు కేటాయించారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఢిల్లీలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ఆర్థిక చేయూతతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే మా ముందున్న లక్ష్యమని తెలిపారు. 2025-26 బడ్జెట్, ఏపీకి కేంద్రం అందిస్తున్న సాయాన్ని వివరించా రు. ఇప్పటికే ప్రపంచమంతా మన దేశం వైపు చూస్తోందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏపీకి అన్ని విధాలా మేలు చేసేలా కేంద్ర బడ్జెట్ ఉందన్న చంద్రబాబు ఏఐ, గ్రీన్ ఎనర్జీ వంటి వినూత్నమైన పాలసీలతో మోదీ ప్రభుత్వం ముందుకెళుతోందని తెలిపారు. దేశమంటే మట్టికాదోయ్ - దేశమంటే మనుషులోయ్ అని తెలుగుకవి గురజాడ అప్పారావు చెప్పిన సూక్తిని బడ్జెట్ తొలి వ్యాఖ్యల్లో ప్రస్తావించిన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. అమరావతికి ఈ ఏడాదిలోనే రూ.15 వేల కోట్లు కేటాయిం చబోతున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు ఇచ్చి కేంద్రం ఆదుకుంటుంది. పోలవ రం ప్రాజెక్టుకు రూ.12,157 కోట్లు ప్రకటించిన కేంద్రం ఈ బడ్జెట్‌లో రూ.5,936 కోట్లు కేటాయించింది. విశాఖ స్టీల్‌ను ఆదుకునేందుకు బడ్జెట్‌కు ముందే కేంద్రం రూ. 11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించింది. ఈ బడ్జెట్‌లో రూ. 3,295 కోట్లు, విశాఖ పోర్టు కు రూ.730 కోట్లు, విశాఖ-చెన్నై కారిడార్‌కు రూ.285 కోట్లు కేటాయించారు. విశాఖ రైల్వేజోన్ భవనాలకు శంకుస్థాపనలు చేశారు. కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ల అభివృద్ధికి రూ.5 కోట్లు ప్రకటించినట్లు చెప్పారు.

### ఏపీ అభివృద్ధే లక్ష్యం.. విమర్శలు పట్టించుకోం

గత విధ్వంస పాలనతో అభివృద్ధిలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కువెళ్లింది. విభజనతోనే కాదు.. గత ప్రభుత్వ విధ్వంసంతో ఏపీ దెబ్బతింది. సంపద దోచుకునేవాళ్లు కాదు.. పంచేవాళ్లు కావాలి. ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్నాము. 7 నెలల్లో రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాము. 15% వృద్ధి రేటు లక్ష్యంగా ముందు కెళుతున్నాము. దావోస్ పర్యటన విజయవంత మైంది. పలు అంతర్జాతీయ పరిశ్రమలు ఏపీకి రాబోతున్నాయి. ఉద్యోగ,ఉపాధి కల్పన ధ్యేయంగా అడుగులు వేస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమం రెండూ సమానంగా ప్రజలకు అందిస్తున్నాం. ఏఐ, గ్రీన్ ఎనర్జీ, అగ్రికల్చర్, జీరో పావర్టీ, ఎంఎస్ఎంఈల విషయంలో కేంద్రం ఆలోచనలకు తగ్గట్టు ఏపీ అనుసరిస్తోంది. కొందరు రాజకీయ లబ్ధికోసం బడ్జెట్‌లో ఏపీకి చేసిన కేటాయింపులపై విమర్శలు చేస్తున్నారు. బడ్జెట్‌లో ఏపీ పేరు ప్రస్తావనపై మాట్లాడుతున్నారు. కేంద్రం మన రాష్ట్రానికి నిధులు కేటాయించి ఆదుకోవడం ముఖ్యం కానీ ప్రతిసారీ పేరు చెప్పాల్సిన అవసరం లేదు. కేం ద్రం ఇచ్చే చేయూతతో దేశంలోనే ఏపీని నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం. 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నాం.

### ఢిల్లీ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

ఢిల్లీ మన రాజధాని. మనందరి ఆత్మ గౌరవం. మన దేశానికి వచ్చే విదేశీయులు ముందుగా వచ్చేది ఢిల్లీకే. గత పదేళ్లుగా పాలనా వైఫల్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి అవు తోం ది. ప్రపంచంలోనే అత్యధిక వెదర్ పొల్యూషన్, పొలిటికల్ పొల్యూషన్ ఢిల్లీలోనే ఉంది. చేసిన పనులు ఫలితాలు ఇవ్వకపోవడంతో కేజ్రీవాల్ ఏవేవో చెప్పి ప్రజలను పొల్యూట్ చేయాలని చూస్తున్నారు. ఢిల్లీ గల్లీల్లో మురికినీరు, మంచినీరు కలిసిపోవడంతో ప్రజలు కలుషిత నీరు తాగుతున్నారు. ఢిల్లీలో ఎక్కడ చూసినా అపరిశుభ్రతే కనిపిస్తోంది. యమునా నది మొత్తంగా కలుషితమైంది. వాయు కాలుష్యం అయితే భరించలేని స్థితిలో ఉంది. ఢిల్లీకి ఎవరూ వచ్చేందుకు ఇష్టపడటం లేదు. బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం కనుక ప్రజలు ఆలోచన చేయాలని కోరారు.

# గట్టెక్కించండి!

- ఆర్థిక సంఘం చైర్మన్‌ను కలిసిన చంద్రబాబు
- రాష్ట్రానికి నిధులు కేటాయించాలని వినతి




ఢిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం ఢిల్లీలో 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియాను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి కేటాయించే ఆర్థిక సంఘం నిధుల అంశంపై చర్చించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని నిధుల కేటాయింపు విషయంలో పెద్ద మనస్సు చేసుకుని విడుదల చేయాలని కోరారు. గత ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి ఏవిధంగా ఛిన్నాభిన్నం చేసిందనే విషయాన్ని స్వయంగా నీతిఆయోగ్ ఇచ్చిన నివేదికలో ఉందంటూ సమావేశంలో ప్రస్తావించారు. వారివెంట ఏపీ ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు.

# సేవకు అంకితమయ్యారు!

## సోనూసూద్‌కు సీఎం చంద్రబాబు అభినందనలు

## ఫౌండేషన్ తరపున అంబులెన్సులు విరాళమిచ్చిన సూద్




అమరావతి(చైతన్య రథం): ఏపీ సీఎం చంద్రబాబును నటుడు, 'సూద్ ఛారిటీ ఫౌండేషన్' వ్యవస్థాపకుడు సోనూసూద్ సోమవారం అమరావతిలోని సచివాలయంలో కలిశారు. ఏపీ ప్రభుత్వానికి సోనూసూద్ ఫౌండేషన్ నాలుగు అంబులెన్సులను అందిం చింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును కలిసిన సోనూసూద్.. ఫౌండేషన్ అంబులెన్సు లను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించారు. అనంతరం నాలుగు అంబులెన్సులను సీఎం ప్రారంభించారు. మర్యాదపూర్వకంగా తనను కలవడానికి వచ్చిన సోనూసూద్‌ను ఈ సందర్భంగా చంద్రబాబు అభినందించారు. ఆరోగ్య సంరక్షణలో మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, ఇందులో 'సూద్ చారిటీ ఫౌండేషన్' భాగస్వామి అయినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

### సోనూసూద్.. ఎవరికైనా ఒక్క ఫోన్‌కాల్ దూరంలో..

నటుడిగాతనపై ప్రేమ చూపించిన తెలుగు ప్రజలందరికీ సోనూసూద్ ధన్యవాదాలు తెలిపారు. వైద్య సదుపాయాలు సరిగ్గాలేని ప్రాంతాల కోసం నాలుగు అంబులెన్సులను ఫౌండేషన్‌ద్వారా ప్రభుత్వానికి ఇచ్చామన్నారు. ఈ అంబులెన్సులు ప్రజల ప్రాణాలను కాపా డటంలో ప్రభుత్వానికి ఉపకరిస్తాయన్నారు. తెలుగు ప్రజలు తనకు అత్యంత ఆప్తులన్న ఆయన.. వారికి ఏదైనా చేయటం తన బాధ్యతగా భావిస్తానని తెలిపారు. 'ఏపీ నాకు రెండో ఇల్లు లాంటిది. ఇక్కడి ప్రజల కారణం గానే తాను ఇంతటి వాడినయ్యానన్నారు. అందుకే ఆంధ్రా అంటే ప్రత్యేక ప్రేమ' అని తెలిపారు.

"నా సతీమణి కూడా ఆంధ్రాకు చెందిన తెలుగువారే. కొవిడ్ సమయంలోనే ప్రజలను ఆదుకోవాలన్న నా బాధ్యత మొదలైంది. సోనూసూద్.. ఎవరికైనా ఒక్క ఫోన్‌కాల్ దూరంలోనే.. సమాజానికి మేలు చేయాలనే విషయంలో సీఎం చంద్రబాబు చాలామందికి స్ఫూర్తి. నాకు ఎలాంటి రాజకీయపరమైన ఆశలు లేవు. సామాన్య వ్యక్తిని. ప్రజల మనిషిని. సమాజానికి తిరిగి ఇవ్వాలన్న తపనే నన్ను ఇలా నడిపిస్తోంది. కొవిడ్ సమయం నుంచి సీఎం చంద్రబాబుతో టచ్‌లోవున్నా. వారి ఆశీర్వాదం కూడా ఇప్పుడు తీసుకున్నా" అని సోనూసూద్ వివరించారు.



చైతన్యరథం

# అలసత్వాన్ని సహించను



- ప్రభుత్వ పథకాల పక్కా అమలుకు నిరంతర అభిప్రాయ సేకరణ
- ఐవీఆర్ఎస్ ఫలితాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- సిబ్బంది, ఉద్యోగులు అంకితభావం చూపాలని దిశానిర్దేశం

అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విషయంలో ఎక్కడా అలసత్వం, అవినీతి, నిర్లక్ష్యం కనిపించకూడదని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలు సక్రమంగా జరగాలని.. ప్రజలనుంచి వస్తున్న ఫీడ్ బ్యాక్ ఆధారంగా అవసరమైన మార్పులు చేసుకుని పనిచేయాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల నిర్వహణపై వివిధ రూపాల్లో సేకరించిన సమాచారంపై సీఎం చంద్రబాబు సచివాలయంలో సమీక్ష చేశారు. పింఛన్ల పంపిణీ, అన్న క్యాంటీన్, ఎరువులు పంపిణీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణంవంటి అంశాలపై ప్రజల నుంచి ఐవీఆర్ఎస్, క్యూఆర్ కోడ్ స్కానింగ్‌తోపాటు పలు మార్గాల్లో నిర్వహించిన సర్వే నివేదికలపై సీఎం సమీక్షించారు. కొన్ని ప్రభుత్వ పథకాల అమలులో అక్కడక్కడా ప్రజలనుంచి వస్తున్న ఫిర్యాదులు, ఫీడ్‌బ్యాక్‌పై సమగ్రంగా విచారించి పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఒక వ్యక్తి పింఛను ఇంటివద్ద అందడం లేదని ఫిర్యాదు చేసినా, దీపం పథకంలో ఉచిత గ్యాస్ సిలిండర్ డెలివరీలో సమస్యలు వచ్చినా, అవినీతి ఉన్నా, ఆసుపత్రిలో సేవలపై అసంతృప్తి వ్యక్తం చేసినా వాటిపై చర్చించి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాలపై ప్రజల స్పందనలో అసంతృప్తి వ్యక్తం చేసిన సదరు లబ్ధిదారుల వద్దకు వెళ్లి కారణాలు విశ్లేషించాలని సూచించారు. వ్యక్తులవల్లగాని, వ్యవస్థలో లోపాలవల్లగాని సమస్య ఉన్నట్లు తేలితే.. ప్రతి కాల్‌పై విశ్లేషించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పొరపాట్లు జరిగితే సరిదిద్దాలని.. అయితే ఉద్యోగుల నిర్లక్ష్యం, అవినీతి ఉంటేమాత్రం సహించవద్దని సీఎం స్పష్టం చేశారు. గ్యాస్ పంపిణీ విషయంలో ఎక్కడైనా అవినీతి జరిగితే... గ్యాస్ ఏజెన్సీలను బాధ్యులను చేయాలని సీఎం ఆదేశించారు.

### రసాయినాలు, పురుగు మందుల వాడకం తగ్గించాలి

రాష్ట్రంలో ఎరువుల సరఫరాపై సమీక్ష సందర్భంగా రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకంపై అధికారులతో సీఎం చర్చించారు. పంటల విషయంలో రైతులను కొత్త సాగు పద్దతులవైపు తీసుకువెళ్లాలని సీఎం సూచించారు. టెక్నాలజీ ఉపయోగాలు రైతులకు వివరించి ప్రోత్సహించాలన్నారు. ఏయే పంటలకు ఎంత మొత్తంలో రసాయిన ఎరువులు, పురుగుమందులు వాడుతున్నారు... వాటి ప్రభావంవంటి అంశాలపై సమాచారం సేకరించాలన్నారు. మితిమీరిన స్థాయిలో రసాయిన ఎరువులు, పురుగుమందులు వాడకంవల్ల కలిగే దుష్ఫలితాలను వివరించాలన్నారు. పంజాబ్‌వంటి రాష్ట్రాల్లో విపరీతంగా పురుగు మందులు వాడడం వల్ల.... క్యాన్సర్ రోగుల సంఖ్య పెరిగిందని, ఇది ఎంతో ప్రమాదకరమని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. పురుగు మందులతోపాటు డ్రోన్ల ద్వారా లిక్విడ్ రూపంలో ఎరువులను పిచికారీ చేసే విధానాలను అమలు చేయాలన్నారు. తద్వారా తక్కువ ఎరువులు, పురుగు మందులతో సాగు సాధ్యమవుతుందని సీఎం అన్నారు. ఈ విధానాల అమలుకు పంటలు, రైతులు, ప్రాంతాలవారీగా సమాచారం సేకరించి.. వాటిని డాటా అనలటిక్స్ ద్వారా విశ్లేషించి రైతులకు సూచనలు చేయాలని సీఎం అన్నారు.

### ఉదయం 7 గంటలకు పింఛన్లు పంపిణీ మొదలు పెట్టండి

ఉదయం 5 గంటలకు, 6 గంటలకు పింఛన్ల పంపిణీ మొదలు పెట్టాల్సిన అవసరం లేదని సీఎం స్పష్టం చేశారు. ఉదయం 7 గంటలకు పింఛన్ల పంపిణీ మొదలుపెట్టి... సాయంత్రం 6లోగా పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. పింఛను పంపిణీ సక్రమంగా జరగాలన్నదే తన ఆలోచన అని.... ఆ పేరుతో అనవసర నిబంధనలతో ఉద్యోగులను ఇబ్బందిపెట్టాల్సిన అవసరం లేదని సీఎం అన్నారు. అయితే ఇదే సమయంలో ఇంటివద్దనే పింఛను అనే విధానం పక్కాగా అమలు కావాలని సీఎం సూచించారు.

ఇంటివద్ద కాకుండా.... పొలంలోనో, ఆసుపత్రిలోనో, ఇతర ప్రాంతంలోనో పింఛను పంపిణీ చేసినట్లు తేలితే... వాటికిగల కారణాలను విశ్లేషించాలన్నారు. ప్రజలనుంచి అభ్యంతరం లేనంతవరకు ఇలాంటిచోట్ల వెసులుబాటు కల్పించాలని సీఎం అన్నారు. అయితే పింఛను పంపిణీ విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు... లబ్ధిదారులతో గౌరవంగా, సౌకర్యవంతంగా వ్యవహరించాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు.

## మీ విజయం భావితరాలకు స్ఫూర్తి

**- నేషనల్ గేమ్స్ కాంస్యపతక విజేత సత్యజ్యోతికి మంత్రి లోకేష్ అభినందనలు**



అమరావతి (చైతన్యరథం): ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడల్లో 87 కిలోల విభాగంలో విజయనగరం బిడ్డ టి.సత్యజ్యోతి కాంస్య పతకం సాధించడం పట్ల విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు. పతక విజేత సత్యజ్యోతికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఆమె కృషి, అంకితభావం, కఠోర దీక్ష మా అందరికీ ప్రేరణ ఇస్తోంది. ఆమెలాంటి మహిళలు వెయిట్ లిఫ్టింగ్ రంగంలో అడ్డంకులను అధిగమించి దూసుకెళుతూ భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులోనూ వెయిట్ లిఫ్టింగ్‌లో మరిన్ని కొత్త శిఖరాలకు సత్యజ్యోతి చేరుకోవాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.

## యర్రబాలెంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

### పాల్గొన్న మంత్రి నారా లోకేష్


**- ఘనస్వాగతం పలికిన కూటమి నేతలు, స్థానికులు**

అమరావతి (చైతన్యరథం): మంగళగిరి నియోజక వర్గం యర్రబాలెంలో సోమవారం శ్రీ ముత్యాలమ్మ తల్లి, శ్రీ పోతురాజుస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్‌కు కుటమి నేతలు, స్థానిక ప్రజానీకం ఘనస్వాగతం పలికారు. పండితుల మంత్రోచ్ఛారణల మధ్య మంత్రి లోకేష్ ఆలయంలోకి ప్రవేశించారు. అనంతరం నిర్వహించిన శ్రీ ముత్యాలమ్మ తల్లి, శ్రీ పోతురాజుస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జై ముత్యాలమ్మ తల్లి, జై పోతురాజు స్వామి నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

మంత్రి నారా లోకేష్ రాకను పురస్కరించుకుని వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయనకు ఆశీర్వచనాలు అందించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అనంతరం మంత్రి నారా లోకేష్ ముత్యాలమ్మ తల్లి, పోతురాజుస్వామి వార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్థానికులతో కలిసి ఫోటోలు దిగారు. నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎమ్ఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, గ్రామ మాజీ సర్పంచ్ భీమవరపు శ్రీనివాసరావు, యర్రబాలెం ముత్యాలమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.











- పూర్తిగా అధ్యయనం చేశాకే ఏకాభిప్రాయంతో నిర్ణయాలు
- తీసుకున్న నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాల్సిందే
- డిగ్రీ కాలేజీ యాజమాన్యాలకు మంత్రి లోకేష్ స్పష్టీకరణ
- 5ఏళ్ల అఫిలియేషన్ విధానానికి గ్రీన్ సిగ్నల్

## విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా

# ఉన్నత విద్య ప్రక్షాళన



అమరావతి (చైతన్యరథం): విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా ఉన్నత విద్యావ్యవస్థలో ప్రక్షాళన చేపడతామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఉండవల్లి నివాసంలో ఏపీ ప్రైవేట్ డిగ్రీ కాలేజీల మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రి లోకేష్ సోమవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... గత ప్రభుత్వ నిర్ణయాలన్నింటినీ గుడ్డిగా వ్యతిరేకించడం తమ ప్రభుత్వ అభిమతం కాదని, తమ దృష్టికి వచ్చిన సమస్యలను పూర్తిగా అధ్యయనం చేసి భాగస్వామ్యులైన అందరితో చర్చించిన తర్వాత ఏకాభిప్రాయంతో మాత్రమే కీలకాంశాలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. విద్యాశాఖ మంత్రిగా రాష్ట్రంలో విద్యావ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని భావిస్తున్నా. విద్యాశాఖలో ఇన్ని సమస్యలు ఉంటాయని నేను ఊహించలేదు. సవాల్ గా స్వీకరించి ఒక్కో సమస్యను పరిష్కరిస్తున్నా. ప్రజాప్రభుత్వంలో ఏకపక్ష నిర్ణయాలు ఉండవు. అయితే ఒకసారి నిర్ణయం తీసుకున్నాక అందరూ దానికి కట్టుబడి ఉండాల్సిందే. రాష్ట్రంలో విద్యావ్యవస్థను నెం.1గా తీర్చిదిద్దేందుకు కలిసికట్టుగా ముందుకు వెళదామని మంత్రి లోకేష్ సూచించారు. ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాల విజ్ఞప్తి మేరకు డిగ్రీ కళాశాలలకు ప్రతిఏటా అఫిలియేషన్ స్థానంలో ఐదేళ్ల అఫిలియేషన్ విధానాన్ని తెచ్చేందుకు మంత్రి లోకేష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. యాజమాన్యాల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రతినెలా ఉన్నత విద్యాశాఖ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులతో ఉమ్మడి సమావేశం ఏర్పాటుచేస్తామని చెప్పారు.

### సమస్యలు విన్నవించిన అసోసియేష్ ప్రతినిధులు

ఏపీ ప్రైవేట్ డిగ్రీ కాలేజీల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలను విన్నవిస్తూ... గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిఏటా అఫిలియేషన్ విధానం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఐదేళ్లకోసారి అఫిలియేషన్ విధానాన్ని అమలుచేయాలని కోరారు. అఫిలియేషన్ ఫీజు ఒక్కో యూనివర్సిటీ పరిధిలో ఒక్కొక రకంగా ఉంటోంది. రాష్ట్రమంతటా కామన్ ఫీజు విధానాన్ని అమలుచేసే అంశాన్ని ప్రవేశపెట్టండి. పాత డిగ్రీ కాలేజీలతోపాటు కొత్త కళాశాలలకు కూడా నిర్ణీత సమయంలో అదనపు కోర్సులకు అనుమతి ఇచ్చేలా జీఓ నెం.36ని సవరించండి. రెగ్యులేటరీ కమిషన్ పరిధిలో ఫీజుల నిర్ణయం ఉండటం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. దీనివల్ల క్వాలిటీ ఎడ్యుకేషన్ అందించలేకపోతున్నాం. వయబిలిటీ ఆధారంగా బేసిక్ ఫీజు నిర్ణయం జరగాలి. డిగ్రీ కళాశాలల్లో ఆన్‌లైన్ అడ్మిషన్ విధానంలో మార్పులు తేవాలి. ఇంటర్మీడియట్ అడ్మిషన్ తరహాలో డిగ్రీ అడ్మిషన్లు చేపట్టే విధానాన్ని పరిశీలించండి. గత ప్రభుత్వంలో తెచ్చిన 70:30 మేనేజ్‌మెంట్ కోటా విధానం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. ఈ విధానం స్థానంలో ఆప్షనల్ విధానాన్ని అమలుచేయండి. సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానం వల్ల రాబోయే రోజుల్లో ఉన్నత విద్యారంగం పెనుసవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. దీనివల్ల విద్యార్థులు వివిధరకాల అవకాశాలను అందిపుచ్చుకునే స్కోప్ తగ్గిపోతుంది. ఇప్పటికే డిగ్రీ కాలేజీల్లో ఫ్యాకల్టీ కొరత తీవ్రంగా ఉంది. సింగిల్ మేజర్ విధానం వల్ల ఈ కొరత మరింత తీవ్రతరం అవుతుంది. టీచింగ్ ఫీల్డ్‌కు వెళ్లే వారికి కచ్చితంగా కాంబినేషన్ సబ్జెక్టులు ఉండాలి. సిలబస్ రీ స్ట్రక్చర్ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయండి. ఎంసెట్‌లో కటాఫ్‌ను 25శాతం మార్కుల స్థానంలో 40శాతం మార్కుల విధానాన్ని అమలు చేయండి. నాలుగేళ్ల డిగ్రీ విధానంలో 4వ ఏడాదికి విద్యార్థిని ప్రమోట్ చేసేటప్పుడు గత మూడేళ్లలో 50శాతం మార్కులు ఉండాలన్న నిబంధన తొలగించండి. బీబీఏ, బీసీఏ కోర్సులకు ఏఐసీటీఈ నుంచి అనుమతి తీసుకునే విధానాన్ని తొలగించి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ లేదా యూనివర్సిటీ పరిధిలో అనుమతులు మంజూరు చేయండి. ఏఐసీటీఈ నుంచి అనుమతుల కోసం ప్రతి సెక్షన్‌కు రూ.20 వేల చొప్పున ఒక్కో కోర్సుకు రూ. 60 వేలు చెల్లించాల్సి రావడం కళాశాలలకు భారంగా ఉంది. అంతేకాకుండా 22వేల నుంచి 25వేల చదరపు అడుగుల స్థలం ఉండాలన్న నిబంధన కూడా ఇబ్బందికరంగా తయారైంది. ఈ విషయంలో గతంలో ఎలా ఉంటే అలాగే అనుమతులు ఇచ్చేలా కేంద్రంతో మాట్లాడండి. కళాశాలలకు వివిధ రకాల అనుమతులు ఇచ్చే విషయంలో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కొనసాగించండి. ఈ విషయంలో హయ్యర్ ఎడ్యుకేషన్ విభాగం జోక్యాన్ని సాధ్యమైనంత తగ్గించండి. సిలబస్ ప్రకారం టెక్ట్స్ బుక్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోండి. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన మ్యాన్‌పవర్ కోసం ఈ-జాబ్ పోర్టల్‌ను విస్తృతపర్చండి. డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు నిర్ణీత భూమి ఉండాలన్న నిబంధన విషయంలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన అడ్డగోలు విధానాన్ని సరిచేయండి. ఇంజనీరింగ్ కాలేజీలకు 10 నుంచి 5 ఎకరాలకు తగ్గించి, డిగ్రీ కాలేజిలకు మాత్రం 2 ఎకరాల నుంచి 5 ఎకరాలకు పెంచడం అసంబద్ధం. స్కిల్ డెవలప్‌మెంట్ కు సంబంధించి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లను విద్యార్థులకు ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలతో అనుసంధానం చేయాలని కళాశాలల యాజమాన్య ప్రతినిధులు కోరారు.

ఈ సమస్యలను అధ్యయనం చేసి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, వేపాడ చిరంజీవి, పర్చూరి అశోక్ బాబు, భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, ప్రైవేట్ డిగ్రీ కాలేజీ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు బట్టు శ్యాం ప్రసాద్, గంటా వెంకటయ్య, వై.వెంకటేశ్వరరావు, జగన్మోహన్, మధుబాబు నాయుడు, ఎం.శ్రీనివాసులు, వి.నాగసతీష్, నల్లమిల్లి శేషారెడ్డి, తేజోమూర్తి, కావలి రాజ్ కుమార్, పెదిరెడ్డి ఉమామహేశ్వరరావు, గోలి వెంకట్రావు, గణేష్ చౌదరి, గొల్లు శ్రీనివాసరావు, ఆకుల బాపన్ననాయుడు, సత్యనారాయణరెడ్డి, బర్ల సత్యనారాయణ, ఎన్.సుగుణ, ఎంఎస్ఆర్ ఆంజనేయులు, నామన కనకయ్య, కొప్పిశెట్టి రమణయ్య, దావులూరి ప్రభాకర్ రావు, గొట్టుముక్కల సుధీర్ కుమార్‌రాజు, కె.గుండారెడ్డి, జె.రామాంజి, జి.వెంకటరెడ్డి, సిహెచ్ విజయభాస్కర్ రెడ్డి, కె.జయరాం, వి.రాజశేఖర్, జి.సుబ్బారెడ్డి, పి.మదన్ మోహన్ రెడ్డి, జి.వెంకటేశ్వర్లు, నరసింహరావు, ఎస్ కె హబీబ్, తదితరులు పాల్గొన్నారు.







# ఏపీకి రికార్డుస్థాయిలో కేటాయింపులు

### - రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్



ఢిల్లీ (చైతన్యరథం): రైల్వే బడ్జెట్‌లో ఏపీకి రికార్డు స్థాయి కేటాయింపులు జరిపారని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి రూ.9,417 కోట్లు కేటాయించామని తెలిపారు. యూపీఏ హయాంలో కేటాయించిన నిధుల కంటే ఇవి 11 రెట్లు అధికం అని వివరించారు. రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఢిల్లీలో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ పలు రాష్ట్రాల్లో రైల్వే పనులు జరుగుతున్న తీరును వివరించారు. ఈ సందర్భంగా ఏపీ రైల్వే ప్రాజెక్టుల ప్రస్తావన తీసుకువచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రూ.84,559 కోట్ల విలువైన రైల్వే పనులు ఇప్పటికే జరుగుతున్నాయని వెల్లడించారు. అందుకే బడ్జెట్‌లో ప్రత్యేకంగా ఏపీ గురించి ప్రస్తావించలేదని వివరణ ఇచ్చారు. ఇక, ఏపీలో 73 రైల్వే స్టేషన్ల రూపురేఖలను పూర్తిగా మార్చివేస్తున్నామని వెల్లడించారు. ఆయా రైల్వే స్టేషన్లను ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దుతామని తెలిపారు. మున్ముందు ఏపీకి మరిన్ని వందేభారత్ రైళ్లు కేటాయిస్తామని... ప్రస్తుతం ఏపీలోని 16 జిల్లాల మీదుగా 8 వందేభారత్ రైళ్లు తిరుగుతున్నాయని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వివరించారు. అన్ని రైళ్లు గంటకు 110 కిలోమీటర్ల వేగంతో వెళ్లేలా ఏపీలో అన్ని రైల్వే ట్రాక్‌లు సిద్ధం చేస్తున్నామని... కొన్ని మార్గాల్లో గంటకు 130 నుంచి 160 కిలోమీటర్ల వేగంతో వెళ్లేలా ట్రాక్‌లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో రైల్వే పనులు సత్వరమే జరిగేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని కొనియాడారు.

- ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలకు మంత్రి లోకేష్ విజ్ఞప్తి
- చర్చలు, సంప్రదింపుల ద్వారానే విధాన నిర్ణయాలు
- ఏకపక్ష విధానాలు ఉండవని స్పష్టీకరణ
- క్యాలెండర్ ప్రకారం రీయింబర్స్‌మెంట్ సొమ్ము విడుదలకు కళాశాలల వినతి

## ఇంజనీరింగ్ విద్యలో నాణ్యత పెంపుదలపై

# దృష్టి సారించండి!



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో నాణ్యత పెంచడంపై యాజమాన్యాలు దృష్టి సారించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో ఇంజనీరింగ్ కళాశాలల మేనేజ్ మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం మంత్రి లోకేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా విద్యావ్యవస్థ నిర్వీర్యమైందని, ప్రాథమికస్థాయి నుంచే పరివర్తన తేవాలన్నది తమ లక్ష్యమని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యలో గత 10 సంవత్సరాలుగా సంస్కరణలు లేవు, తాను హెచ్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత సంస్కరణలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. అన్ని విద్యాసంస్థల్లో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పెరగాల్సి ఉందన్నారు. విద్యావ్యవస్థలో నైతిక విలువలతో కూడిన సంస్కరణలు తేవాలన్నది తమ ఉద్దేశంగా పేర్కొన్నారు. సంస్కరణలు అమలుచేసే క్రమంలో ఏవైనా తప్పులు దొర్లితే సరిదిద్దుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తమ ప్రభుత్వంలో ఏకపక్ష నిర్ణయాలు ఉండవని, చర్చలు, సంప్రదింపుల ద్వారానే ఏదైనా విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ ఏడాది ఆర్‌టీఎఫ్ స్కాలర్‌షిప్ లకు సంబంధించి తొలివిడతలో రూ.788 కోట్లకు గాను, ఇప్పటికే 571.96 కోట్లు విడుదల చేశామని, రెండు, మూడు రోజుల్లో మిగిలిన 216.04 కోట్లు కూడా విడుదల చేస్తామని తెలిపారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్, ఆర్ అండ్ డి, ఇన్నొవేషన్స్‌పై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్లేస్‌మెంట్స్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించి ఇంజనీరింగ్ విద్య నాణ్యత పెంచేందుకు అందరి అభిప్రాయాలు తీసుకుంటామని మంత్రి లోకేష్ తెలిపారు.

### ఫీజులు సవరించాలి

ఇంజనీరింగ్ కళాశాలల ప్రతినిధులు మాట్లాడుతూ... ఇంజనీరింగ్ విద్యార్థులకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును ఎప్పటికప్పుడు క్యాలండర్ ప్రకారం విడుదల చేయాలని కోరారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఫీజులు గిట్టుబాటుగా లేవని, వాటిని సవరించాలని కోరారు. ఈ విషయంలో ముందస్తుగా కసరత్తు ప్రారంభించాలన్నారు. ఎంసెట్ షెడ్యూలును నిర్ణీత సమయం ప్రకారం విడుదల చేయాలని, ఎంసెట్‌లో మూడు కౌన్సిలింగ్‌ల విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో చదివిన విద్యార్థుల ప్లేస్‌మెంట్స్ విషయంలో ప్రభుత్వం చొరవ చూపాలని, ఇందుకోసం స్టేట్ లెవల్ జాబ్ మేళాతో సహా యూనివర్సిటీల్లో ఆయా కంపెనీలను రప్పించి జాబ్ మేళాలు నిర్వహించాలన్నారు. అటెండెన్స్ విషయంలో వెయిటేజి విధానాన్ని అమలుచేస్తే సత్ఫలితాలు ఉంటాయని సూచించారు. తద్వారా విద్యార్థుల్లో మోటివేషన్ వచ్చి హాజరు శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసర్చ్ (ఎన్ఐటీటీటీఆర్) ను పునరుద్ధరించాలని, వీలైతే 3చోట్ల ఈ కేంద్రాలను ఏర్పాటుచేసి అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నేషనల్ క్రెడిట్ అండ్ క్వాలిటీ ఫ్రేమ్ వర్క్ (ఎన్‌సీక్యుఎఫ్)కు లోబడి మైక్రో సర్టిఫికేషన్‌ను అమలుచేయాలని సూచించారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, పర్చూరి అశోక్ బాబు, వేపాడ చిరంజీవి, ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసిరెడ్డి విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్సీ చైతన్య రాజు, కోయ సుబ్బారావు(కిట్స్, గుంటూరు), జి.రాజలింగ్ (ఎల్ఐఎంటి, కృష్ణా), కె.రామ్మోహన్‌రావు(ఎఎస్ఐపి, కృష్ణా), కెవి సుబ్బారెడ్డి (కెవిఎస్ఆర్, కర్నూలు), వి.జయచంద్రారెడ్డి (సిబిఐటి, కడప), ఆర్.వెంకట్రావు (ఎన్ఆర్ఐ అకాడమీ, కృష్ణా), షేక్ కరీమ్ మొహిద్దీన్ (ఈశ్వర్, గుంటూరు), నన్నపనేని భాస్కర్ (ఎన్‌విఆర్ సిఇటి, గుంటూరు), ఎంవి కోటేశ్వరరావు (నర్సరావు పేట ఇంజనీరింగ్ కాలేజి, గుంటూరు), మద్దిశెట్టి శ్రీధర్ (పేస్, ప్రకాశం), కెవి సత్యనారాయణ (స్వర్ణాంధ్ర కాలేజెస్), సుజిత్ యలమంచిలి (సిఇఎస్, విశాఖపట్నం),ఎన్.శేషారెడ్డి(ఆదిత్య, తూర్పుగోదావరి), బోనం కృష్ణసతీష్(బివిసి ఇనిస్టిట్యూషన్స్), ఎం.నరేంద్ర కృష్ణ (శశి ఇంజనీరింగ్ కాలేజి), ఎస్ఆర్‌కె నిషాంత్ వర్మ (ఎస్ఆర్ కెఆర్ ఇంజనీరింగ్ కాలేజి), పర్చూరి కృష్ణారావు (ప్రగతి ఇంజనీరింగ్ కాలేజి), సతీష్‌రెడ్డి (ఆదిత్య యూనివర్సిటీ), శశివర్మ (గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ), సుబ్బారావు (వాసవి ఇంజనీరింగ్ కాలేజి), తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## పోటీ పడదాం.. అందరం కలిసి

# విద్యావ్యవస్థను బలోపేతం చేద్దాం

- ప్రైవేటు పాఠశాలల గుర్తింపు గడువును పదేళ్లకు పెంచుతాం
- ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశంలో మంత్రి నారా లోకేష్
- యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని హామీ



అమరావతి (చైతన్యరథం): ప్రైవేటు పాఠశాలల గుర్తింపు గడువును పదేళ్లకు పెంచుతామని విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఉండవల్లిలోని నివాసంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు, యాజమాన్యాలతో సోమ వారం మంత్రి నారా లోకేష్ సమావేశమయ్యారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. పోటీ పడదాం.. అందరం కలిసి విద్యావ్యవస్థను బలోపేతం చేద్దామని పిలుపు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైంది. విద్యాశాఖ మంత్రిగా నాపై పవిత్ర బాధ్యత ఉంది. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తాం. గత వైసీపీ ప్రభుత్వ అసమర్థత కారణంగా లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు తర లివెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టాం. కరి క్యులమ్‌లో మార్పులు తీసుకురావడంతో పాటు నైతిక విలువలు పెంపొందించేందుకు చర్యలు చేపట్టాం. వైసీపీ హయాంలో విద్యావ్యవస్థ సంక్షోభంలో కూరుకు పోయింది.ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పడిపోతే అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయి. పాఠశాల విద్యలో సంస్కరణలపై మేం అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాతనే ముందుకు వెళ్తున్నాం. నేను ఏరికోరి విద్యాశాఖను ఎంచుకున్నా. వైసీపీ పాలనలో గందరగోళంగా మారిన విద్యావ్యవస్థను ఛాలెంజ్‌గా తీసుకుని పనిచేస్తున్నాం. మేం చేయాలనే తపనతో ఉన్నాం. విద్యరంగాన్ని బలోపేతం చేసే బాధ్యత అటు ప్రైవేటు సూళ్లకు, ఇటు ప్రభుత్వానికి ఉంది. అందరం కలిసి విద్యా వ్యవస్థను బలోపేతం చేద్దాం.యువగళం పాదయాత్ర సమయంలో ఉపాధ్యాయుల సమస్యలు అనేకం నా దృష్టికి వచ్చాయి. పాదయాత్రలో హామీ ఇచ్చిన విధంగా ప్రైవేటు పాఠశాలల గుర్తింపు గడువు ను పదేళ్లకు పెంచుతాం. ప్రైవేటు స్కూల్స్ నిర్వాహకు లతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకుంటామని మంత్రి లోకేష్ చెప్పారు.

### సమస్యలు పరిష్కరించాలి

ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రైవేటు పాఠశాలల గుర్తింపు గడువును పదేళ్లకు పెంచాలని కోరారు. క్యాంపస్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావడంతో పాటు ఫైర్ సర్టిఫికెట్, స్ట్రక్చరల్ ఎన్వోసీ, శానిటేషన్ సర్టిఫికెట్ మంజూరును సులభతరం చేయాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్లకు గుర్తింపు ఇవ్వాలని కోరారు. ప్రీ ప్రైమరీ పాఠశాలల కు గుర్తింపు ఇవ్వడంతో పాటు అర్హత లేని ఉపాధ్యాయు లకు డీఎల్ ఈడీ చేయడానికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కరోనా సమయంలో రెండేళ్ల పాటు ప్రైవేటు స్కూల్ బస్సులు నిరుపయోగం గా ఉన్నాయని, వాటి కాలపరిమితి రెండేళ్లు పెంచా లని కోరారు. రాష్ట్రంలో తెలుగు మీడియం ప్రైవేటు పాఠశాలలు 150వరకు ఉన్నాయని, వాటిని ఇంగ్లీషు మీడియంగా కన్వర్షన్ చేయాలని అభ్యర్థించారు. బడ్జెట్ స్కూల్స్‌కు రుణ సదుపాయం కల్పించాలి. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు కూడా ప్రతిభా పురస్కారాలు అందజేయాలి. ప్రైవేటు స్కూల్స్‌ను కేటగిరైజ్ చేసే అంశాలన్నింటినీ పరిశీలించాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా శిక్షణ తరగతులు నిర్వహిం చడంతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులతో కలిసి క్రీడల్లో పాల్గొనేం దుకు అనుమతి ఇవ్వాలి. పదో తరగతిలో తిరిగి గ్రేడింగ్ సిస్టమ్‌ను తీసుకురావాలి. ఓపెన్ స్కూల్స్ గుర్తింపు గడువును కూడా పదేళ్లకు పెంచాలి. ముంపు మండలాల్లో ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిం చాలి. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి. స్కూల్ బస్సుల విషయంలో పన్నుల భారాన్ని తగ్గించాలని కోరారు. ఆయా అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి తగిన చర్యలు తీసుకుంటా మని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పరుచూరి అశోక్ బాబు, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, వేపాడ చిరంజీవితో పాటు వివిధ ప్రైవేటు స్కూల్స్ అసిసోయేషన్ ప్రతినిధులు, పాఠశాలల నిర్వాహకులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# చరిత్ర సృష్టించాలంటే పోరాడాలి

- సమస్యలు పరిష్కరించుకునే శక్తి మనకు ఉంది
- ప్రపంచ దేశాల చూపు భారత్ వైపు
- ఓం క్యాప్ ద్వారా విదేశాల్లో ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు
- ప్రైవేటు ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీ అసోసియేషన్ల ప్రతినిధుల సమావేశంలో మంత్రి నారా లోకేష్



అమరావతి (చైతన్యరథం): చరిత్ర సృష్టించాలంటే పోరాడాలని, ఐదేళ్లలో విద్యావ్యవస్థలో మార్పులకు అందరి సహకారం కావాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లిలోని నివాసంలో ప్రైవేటు ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, ఒకేషనల్, అన్ ఎయిడెడ్ కాలేజీల అసోసియేషన్ల ప్రతినిధులతో సోమవారం మంత్రి లోకేష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. మీరందరూ రాబోయే తరాలను తయారుచేస్తున్నారన్నారు. ప్రపంచంలో జనాభా వేగంగా తగ్గిపోతోంది. ఇప్పుడు ప్రపంచ దేశాల దృష్టంతా భారతదేశం వైపే ఉంది. ఓం క్యాప్ ద్వారా ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యం. టీడీపీ కేంద్ర కార్యాలయంలో స్కిల్డ్ వర్కర్లకు శిక్షణ ఇవ్వడం ద్వారా దాదాపు 150 మందికి అమెరికాలో ఉద్యోగ అవకాశాలు లభించాయి. యువతకు విదేశాల్లో ఉద్యోగాలు కల్పించేలా ఓం క్యాప్ ద్వారా శిక్షణ అందిస్తాం. కాలేజీలను పరిశ్రమలతో లింకేజీ చేయాల్సిన అవసరం ఉంది. విద్యా వ్యవస్థ ప్రక్షాళనకు సిద్ధంగా ఉన్నాం. మన సమస్యలు మనమే పరిష్కరించుకుందాం. ఎవరైనా తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా వెల్లడించవచ్చు. సమస్యలు పరిష్కరించే శక్తి మనకిచ్చారు. కాలేజీలకు అఫిలియేషన్ల విషయంలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### మంత్రి లోకేష్ దృష్టికి సమస్యలు

ప్రైవేటు ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, ఒకేషనల్, అన్ ఎయిడెడ్ కాలేజీల అసోసియేషన్ల ప్రతినిధులు తమ సమస్యలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇంటర్ కాలేజీలకు అఫిలియేషన్ల జారీలో సమస్యలు ఉన్నాయని, నిర్దిష్ట విధానాన్ని రూపొందించాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వం మాదిరిగానే ఇంటర్ విద్యార్థులకు ఆర్టీఎఫ్, ఎంటీఎఫ్ సౌకర్యం కల్పించాలి. కాలేజీ ట్రాన్స్‌ఫర్ విషయంలో అపరాధ రుసుముల భారాన్ని తగ్గించాలి. జూనియర్ కాలేజీల విషయంలో బోర్డు కమిటీలో ప్రైవేటు జూనియర్ కాలేజీల అసోసియేషన్ నుంచి ఒకరికి స్థానం కల్పించాలని కోరారు. ప్రైవేటు అన్ ఎయిడెడ్ అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి అతి తక్కువ జీతాలు అందుతున్నాయని, వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటుచేసి ఆదుకోవాలని కోరారు. ఐటీఐలను పరిశ్రమలతో లింకేజీ చేయాలి. ప్రభుత్వ విభాగాల్లో అప్రెంటిషిప్‌ను అమలు చేయడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. పాలిటెక్నిక్ సిలబస్, పరీక్షా విధానంలో మార్పులు రావాల్సిన అవసరం ఉంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంటర్ ఒకేషనల్ కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పరుచూరి అశోక్ బాబు, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, వేపాడ చిరంజీవితో పాటు ప్రైవేటు ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, ఒకేషనల్, అన్ ఎయిడెడ్ కాలేజీల అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.









---

వరుసగా 60 రోజులు దుమ్మా కొడితే

## జగన్ అసెంబ్లీ సభ్యత్వం రద్దు

- ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ



ఢిల్లీ: పులివెందుల ఎమ్మెల్యేగా జగన్ వరుసగా 60 రోజులు అసెంబ్లీకి దుమ్మా కొడితే.. శాసనసభ సభ్యత్వం దానంతట అదే రద్దవుతుందని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు చెప్పారు. ప్రతిపక్ష నేత హోదా కోసం కోర్టులో కేసు ఉన్నా దానితో సంబంధం లేదన్నారు. సోమవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఏ సభ్యుడయినా అసెంబ్లీకి రాకపోతే సహేతుక కారణాలతో సెలవు అభ్యర్థన ఇవ్వాలన్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సింది ప్రజలేగానీ, స్పీకర్ కాదని స్పష్టం చేశారు. ఏ శాసనసభ్యుడైనా వరుసగా 60 రోజులు అసెంబ్లీకి రాకపోతే సభ్యత్వం రద్దవుతుంది. అసెంబ్లీకి వచ్చి సంతకం పెట్టి వెళ్లిపోవచ్చు. అలా చేస్తే తన సీటు కాపాడుకోవచ్చు. జగన్ ఇప్పటివరకు సెలవు అభ్యర్థన ఇవ్వలేదు. వరుసగా 60 రోజులు రాకపోతే పులివెందులకు తప్పకుండా ఉపఎన్నిక వస్తుందని రఘురామకృష్ణరాజు తెలిపారు. సీఐడీ కస్టడీలో చిత్రహింసల కేసులో తన పోరాటం కొనసాగుతుందని రఘురామ స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని నమ్ముతున్నానని చెప్పారు. దోషులకు శిక్ష పడుతుందనే సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు.

---

## రథ సప్తమికి తిరుమలలో సర్వం సిద్ధం

- సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా
- ఉదయం నుంచి రాత్రి వరకు ఏడు వాహనాలపై శ్రీవారు
- నిరంతరాయంగా అన్నప్రసాదాల పంపిణీ
- మాడవీధుల్లో ఏర్పాట్లను పరిశీలించిన టీటీడీ ఈవో, అదనపు ఈవో



తిరుమల (చైతన్యరథం): రథ సప్తమి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయ మాడ వీధుల్లో చేసిన ఏర్పాట్లను సోమవారం సాయంత్రం అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి టీటీడీ ఈవో జె.శ్యామలరావు పరిశీలించారు. గ్యాలరీల్లో అన్న ప్రసాదం పంపిణీ, తాగునీరు,మరుగుదొడ్లు, షెడ్లు వంటి సౌకర్యాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీసులు, విజిలెన్స్ సమన్వయంతో మాడ వీధుల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని అన్నారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ మంగళవారం రథసప్తమి పర్వదినం సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. ఉదయం నుండి రాత్రి వరకు ఏడు వాహనాలపై స్వామివారు తిరుమాడ వీధుల్లో ఊరేగుతారని తెలిపారు. రథ సప్తమి సందర్భంగా రెండు నుండి మూడు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఎండ వల్ల భక్తులకు ఇబ్బంది కలగకుండా షెడ్లు ఏర్పాటు చేశామని, మాడ వీధుల్లో ఉన్న భక్తులకు నిరంతరాయంగా అన్న ప్రసాదం పంపిణీ చేస్తామన్నారు. రాత్రి చంద్రప్రభ వాహన సేవ వరకు అన్న ప్రసాదాల పంపిణీ నిరంతరంగా కొనసాగుతుందన్నారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంచనున్నట్లు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రెండు రెట్లు అధిక భద్రత కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఇన్‌ఛార్జ్ సీవీఎస్వో మణికంఠ చందోలు, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఎఫ్ అండ్ సీఏఓ బాలాజీ, సీఈ సత్య నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

---

## అమరావతి రైల్వేలైన్ నాలుగేళ్లలో పూర్తి

- విజయవాడ రైల్వే డీఆర్ఎం

విజయవాడ: ఎర్రుపాలెం – నంబూరు మధ్య రాజధాని అమరావతి మీదుగా కొత్త రైల్వే లైన్ నిర్మాణాన్ని నాలుగేళ్లలో పూర్తి చేయనున్నట్లు విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ. పాటిల్ తెలిపారు. ప్రస్తుతం ట్రాక్ నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన ప్రక్రియ కొనసాగుతోందన్నారు. రూ.2,545 కోట్లతో అమరావతికి కొత్త రైల్వే లైన్‌ను గత ఏడాది అక్టోబర్‌లో కేంద్ర క్యాబినెట్ ఇప్పటికే ఆమోదించినట్లు గుర్తు చేశారు. ఈ లైన్ రాజధాని అమరావతిని గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, చెన్నై సహా పలు ప్రాంతాలతో కలుపుతుందన్నారు. ఈ ఏడాది జనవరి నాటికి విజయవాడ డివిజన్ రూ.4,865 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసిందని, ఇది గతేడాది కంటే 3.62శాతం ఎక్కువని తెలిపారు. ఈ ఏడాది విజయవాడ డివిజన్ నుంచి రూ.5వేల కోట్లకు పైగా ఆదాయం రాబట్టాలన్నదే లక్ష్యమన్నారు. విజయవాడ రైల్వే స్టేషన్ ఏడాదికి రూ.500 కోట్ల ఆదాయాన్ని పొందే స్టేషన్‌గా గుర్తింపు పొందిందని డీఆర్ఎం తెలిపారు. విజయవాడ – విశాఖ డివిజన్ మధ్య 128 కిలోమీటర్ల ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను పూర్తి చేశామని, దీనివల్లే సంక్రాంతి పండుగ సీజన్లో విజయవాడ డివిజన్ 86 శాతం పంక్చువాలిటీతో రైళ్లు నడిపినట్లు డీఆర్ఎం తెలిపారు.



చైతన్యరథం

# జగన్ గ్యాంగ్‌కు చీపుర్లతో సన్మానం తప్పదు

- విద్యార్థులను రెచ్చగొట్టాలని చూస్తే ఖబడ్దార్
- పెయిడ్ బ్యాచ్‌తో విఘాతం కలిగిస్తే ఊరుకోం
- ఆయన ప్యాలెస్‌ల ముందు ఫీజుపోరు చేపట్టాలి
- లోకేష్ ఇచ్చిన మాట నెరవేర్చి మంచి చేశారు
- రూ.800 కోట్ల ఫీజు బకాయిలు చెల్లించారు
- నిధుల విడుదలపై దమ్ముంటే చర్చకు రావాలి
- టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం

మంగళగిరి(చైతన్యరథం): 'ఫీజు పోరు' చేయాల్సింది కలెక్టరేట్ల ముందు కాదు, జగన్ యలహంక ప్యాలెస్ ముందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం హితవుపలికారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోకేష్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించి విద్యార్థుల్లో మానసిక ధైర్యాన్ని కల్పించి మంచి చేశారు.. వైసీపీ నాయకులు తమ ముఖాలపై పేడ నీళ్లు చల్లించుకోవడానికి సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. 2024 వరకు వైసీపీ విద్యార్థుల తల్లిదండ్రులకు మానసిక క్షోభ మిగిల్చింది. లోకేష్ 8 నెలల్లో రూ.800 కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయడం హర్షించదగ్గ పరిణామమని పేర్కొన్నారు.

### విద్యార్థి నాయకులను వేధించింది నిజం కాదా...

వైసీపీ ప్రభుత్వం కోడిగుడ్ల బకాయిలు రూ.200 కోట్లు, చిక్కీల బకాయిలు రూ.56కోట్లు, విద్యార్థులకు బ్యాగులు, బెల్టులు, బూట్ల బకాయిలు రూ.920 కోట్లు పెట్టి వెళ్లింది. లోకేష్ విద్యారంగంలో అనేక రకాల విద్యార్థి సంస్కర ణలను తెచ్చారు. 2019కి ముందు జగన్ తన పాదయాత్రలో అబద్ధాలు చెప్పి విద్యార్థి లోకాన్ని మోసం చేశారు. వారి ఓట్లను దండుకుని అధికారంలోకి వచ్చారు. 2024 వరకు విద్యార్థుల తల్లిదండ్రులకు మానసిక క్షోభను మిగిల్చారు. అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులు ఉద్యోగాలు, విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, పేద విద్యార్థులు స్కాలర్ షిప్స్, హాస్టల్ విద్యార్థులు కాస్మోటిక్ ఛార్జెస్ అడిగితే విద్యార్థులను, విద్యార్థి సంఘ నాయకులను పోలీసులచే లాఠీలతో కొట్టించారు. పేద విద్యార్థుల తరపున నిలబడిన విద్యార్థి నాయకులను జైళ్లకు పంపారు. రాబోయే తరాలు మరచి పోని విధంగా ఇబ్బదులు పెట్టారు. 2019-24 వరకు రూ.2,830 కోట్లు ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు, వసతి దీవెన పేరుతో రూ.989 కోట్లు, కోడిగుడ్ల బకాయిలు రూ.200 కోట్లు, చిక్కీల బకాయిలు రూ.56 కోట్లు, విద్యార్థులకు బ్యాగులు, బెల్టులు, బూట్ల బకాయిలు రూ.920 కోట్లు, మొత్తం రూ.5,447 కోట్లు బకాయిలు జగన్ ప్రభుత్వం బకాయిలు పెట్టింది. అంతేకాక విద్యార్థులకు ట్యాబ్‌ల పేరుతో రూ.1200 కోట్లు, విద్యాకానుక పేరుతో రూ.400 కోట్లు, నాడు నేడు పేరుతో రూ.3 వేల కోట్లు దోపిడీ చేశారు. విద్యార్థులకు కేటాయించిన రూ.5,447 కోట్లు బకాయే కాకుండా రూ.4,600 కోట్లు పేద విద్యార్థుల సొమ్మును వైసీపీ నాయకులు జగన్ అండ్ కో జేబులు నింపుకుందని మండిపడ్డారు.

### పేద విద్యార్థులకు అండగా లోకేష్

ఒక పక్క జగన్ రూ.5,447 కోట్లు బకాయిలు పెట్టి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మానసిక క్షోభకు గురి చేస్తే.. నేడు విద్యాశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నారా లోకేష్ 8 నెలల్లో రూ.800 కోట్ల ఫీజు బకాయిని విడుదల చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆర్థిక మనోధైర్యాన్ని పెంచారు. లోకేష్ పాదయాత్ర సమయంలో జగన్ ప్రభుత్వంలో అన్ని ప్రాంతాల్లో ఫీజు కట్టకపోవడం వల్ల పరీక్షలు రాయనివ్వడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మొరపెట్టుకు న్నారు. తెలు గుదేశం అధికారంలోకి రాగానే మొదటి వందరోజుల్లో విద్యార్థుల సమస్యలను తీరుస్తూ విద్యారంగ సంస్కరణలను తీసుకొస్తామని అప్పుడే చెప్పారు. అందులో భాగంగానే అధికారంలోకి రాగానే



నిరుద్యోగులకు డీఎస్సీ ప్రకటించారు. విద్యార్థులకు రూ.800 కోట్లు బకాయిలు విడుదల చేశారు. అనేక రకాల విద్యార్థి సంస్కరణలను తెచ్చారు. పేద విద్యార్థులకు లోకేష్ అండగా ఉన్నారని గుర్తుచేశారు.

### చీపుర్లతో కొట్టడం ఖాయం

బయట ఏ వర్గాన్ని కదిలించినా జగన్ గ్యాంగ్‌ను చీపుర్లతో కొట్టే పరిస్థితి ఉంది. వైసీపీ నాయకుల మొహాన పేడ నీళ్లు కొడతారనే భయం వారిలో ఉంది. వైసీపీ నాయకులు ఎక్కడ బయటకు వెళ్లలేని పరిస్థితులు. కాగా నేడు ఫీజు పేరు పేరుతో విద్యార్థులను రెచ్చగొట్టాలని చూస్తున్నారు. వైసీపీ పార్టీని బతికించుకోవడానికి, తన పార్టీలో రాజకీయ నిరుద్యోగులుగా ఉన్న కొందరు యువకులను రెచ్చగొట్టి కలెక్టరేట్ల ముందు 'ఫీజు పోరు' చేస్తామంటున్నారు. 2022లో వైసీపీ అధికారంలో ఉండగా శ్రీకాకుళం జిల్లా వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఎదుట ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదని ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. డిసెంబర్ 17, 2023న నెల్లూరు జిల్లా కావలిలో ఫీజ్ రీయింబర్స్‌మెంట్ డబ్బులు అందలేదని దాదాపు 30మంది ఫైనల్ ఇయర్ నర్సింగ్ విద్యార్థులను నర్సింగ్ కళాశాల బయటకు పంపేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. దీనికి వైసీపీ దొంగల ముఠా సమాధానం చెప్పాలి. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలో చూపిన ఆసక్తి విద్యార్థుల ఫీజు బకాయిలు కట్టడానికి చూపలేదని ధ్వజమెత్తారు.

### వైసీపీ నాయకుల మోసాలపై చర్చకు రావాలి

నకిలీ విద్యార్థులతో కలెక్టరేట్ల వద్ద ఫీజు పోరు నిర్వహించాలని చూస్తున్నారు. కలెక్టరేట్ల ముందు కాదు..జగన్ యలహంక ప్యాలెస్, తాడేపల్లి ప్యాలెస్‌ల ముందు ధర్నాచేయాలి. లోకేష్ విడుదల చేసిన 8 రోజుల క్రితం రూ.800 కోట్లిచ్చిన వాస్తవాన్ని కలెక్టర్లనే అడిగి తెలుసుకోవచ్చు. అర్థం పర్థం లేకుండా ఫీజుపోరు చేస్తు న్నారు. అమాయకులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మభ్యపెట్టొద్దు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే టీడీపీ, కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. వైసీపీ ప్రభుత్వం పెట్టి వెళ్లిన బకాయిలు, లోకేష్ విడుదల చేసిన బకాయిల నిధులపై చర్చకు సిద్ధమా? స్థలం, టైమ్, డేట్ చెప్పండి. అనేక మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని లోకేష్ మాట్లాడి సర్టిఫికెట్లు ఇప్పించారు. రెచ్చగొట్టాలని చూస్తే ఖబడ్దార్. నకిలీ ధర్నాలు, ఫీజు పోరులు చెల్లవు. ప్రకాశం బ్యారేజీ మీద ముక్కు నేలకు రాసి విద్యార్థుల తల్లిదండ్రులకు క్షమాపణ చెప్పాలి. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టినట్లుగా నోటిఫికేషన్లు విడుదల చేస్తోంది. మేనిఫెస్టోలో పెట్టనప్పటికి ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థు లకు స్టడీ సర్కిల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థుల సమస్యలపై వైసీపీ నాయకులకు విద్యారంగంపై చిత్తశుద్ధి ఉంటే ఫీజు పోరు పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు వైసీపీ నాయకులు చేసిన అక్రమాలు, అన్యాయాలు, మోసాలపై చర్చకు రావాలి. ఈ ఐదేళ్ల రాష్ట్రాన్ని అధోగతిపాలు చేశారు, ఈ విషయాలు చర్చించడానికి సిద్ధం. ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

# కోతలరాయుడు 'జగన్‌రెడ్డి'!

'మేడిపండు చూడ మేలిమైయుండు.. పొట్టవిప్పి చూడ పురుగులుండు" అన్న సామెత జగన్‌రెడ్డి పాలనకు అచ్చంగా సరిపోతుంది. ఆర్భాటపు ప్రచారాలతో మభ్యపెట్టి, విద్యావ్యవస్థను పూర్తిగా పాతాళానికి దిగజార్చిన ఘనత ఆయనదే. చెదపురుగు మాదిరి రాష్ట్రంలో అన్ని రంగాలను దోచేసి తానేదో రాష్ట్రాన్ని ఉద్ధరించినట్టు ఐదేళ్లు అరచేతిలో వైకుంఠం చూపించి ప్రజలను మోసంచేసిన మహా మాయగాడు జగన్‌రెడ్డి.

"నాడు-నేడు" పేరిట స్కూళ్ల రూపురేఖలు మార్చేశామంటూ, ఇంగ్లీష్ మీడియం పేరుతో పేదపిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దామంటూ జగన్‌రెడ్డి పిట్టలరాయుడి కబుర్లతో ఐదేళ్లు కాలక్షేపం చేసి విద్యార్థులను కనీసం అంకెలు, అక్షరాలను కూడా గుర్తించ లేనిస్థితికి దిగజార్చాడు.

### విద్యాభివృద్ధి కాదు -విద్యా విధ్వంసమే!

రాష్ట్రవ్యాప్తంగా 44,293 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వీటిలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య 33,62,093 మాత్రమే. అదే సమయంలో, ప్రైవేట్ రంగంలో 13,484 పాఠశాలల్లో 34,02,049మంది విద్యార్థులు చదువుతున్నారు. అదనంగా 789 ఎయిడెడ్ పాఠశాలల్లో 88,330మంది విద్యార్థులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతంచేసి, విద్యను అందరికీ చేరువ చేయాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ,వైసీపీ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంతో వ్యవహరించింది. మౌలిక సదుపాయాలు మెరుగుపరిచి నాణ్యమైన విద్యను అందించాల్సింది బదులు,ప్రజాధనాన్ని అర్థరహిత కార్య క్రమాలకు మళ్లించి,ప్రైవేట్ విద్యాసంస్థలకు లబ్ధిచేకూర్చే విధంగా వ్యవహరించింది. వైసీపీ పాలనలో అసమర్థత కారణంగా, రాష్ట్రంలోని 70శాతం పైగా ప్రభుత్వ ప్రాథ మిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 60మందికి పడి పోవడం అత్యంత ఆందోళనకరమైన పరిణామంగా మారింది.

తప్పుడు లెక్కలను అడ్డుపెట్టుకుని, ప్రభుత్వ పాఠశా లల్లో విద్యార్థుల చేరిక పెరిగిందని అంకెల గారడీ చేసి, తన అద్భుత విధానాలవల్లే ఇది సాధ్యమైందని సొంత పత్రికల్లో గొప్పలు చెప్పించుకున్న జగన్‌రెడ్డి, ఐదేళ్ల పాటు ప్రజలను మోసం చేశాడు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు విద్యా ప్రమాణాలను మెరుగుపరుచుకునే దిశగా ముందుకు సాగుతుండగా,ఆంధ్రప్రదేశ్ మాత్రం జగన్‌రెడ్డి పాలనలో పూర్తిగా పతనమైంది.

ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను బలోపేతం చేయకపోగా తరగతులను తరలించడం, పాఠశా లలను విలీనం చేయడం,ఉపాధ్యాయుల రేషన లైజేషన్ విధానాలతో పేద, బడుగు, బలహీనవర్గాలకు విద్యను దూరం చేశాడు జగన్‌రెడ్డి. వైసీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చేనాటికి రాష్ట్రంలో 2002 ఎయిడెడ్ విద్యా సంస్థలు ఉండగా, వైసీపీ గద్దె దిగేనాటికి కేవలం 837 పాఠశాలలు మాత్రమే మిగిలాయి. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు 117 జీవో ద్వారా పాఠశాలల విలీనం పెద్ద దెబ్బ అయితే.. ఎయిడెడ్ పాఠశాలలు మూత పడడం విద్యారంగ పతనానికి మరొక దెబ్బ.

### వైసీపీ పాలనలో విద్యాప్రమాణాలు నిర్వీర్యం

చదువుల తల్లి కన్నీరు పెట్టేలా విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడం, ఉపాధ్యాయులను ఇబ్బందులపాలు చేయడం వంటి చర్యలతో విద్యార్థుల భవిష్యత్తును అగాథంలోకి నెట్టివేశాడు జగన్‌రెడ్డి. ప్రాథమికస్థాయి నుంచి ఉన్నత విద్య వరకు అన్ని రంగాల్లో వైసీపీ ప్రభుత్వం చేసిన దోపిడీ, అవినీతి, అశాశ్వత విధానాల ప్రభావం నేడు విద్యారంగంలో సంక్షోభానికి మూల కారణం. జగన్ ప్రభుత్వం తల్లిదండ్రుల అభిప్రాయాల ను పక్కనపెట్టి, విద్యా నిపుణుల సూచనలను లెక్కచేయ కుండా ప్రపంచం గుర్తించే మాతృభాష విద్యను పూర్తిగా అణగదొక్కింది. దేశంలోనే 3వ స్థానంలో ఉన్న విద్యా రంగం, 2023నాటికి 19వ స్థానానికి దిగజారడం జగన్ ప్రభుత్వ వైఫల్యానికి నిలువుటద్దం.

విద్యారంగంతో బంతాట ఆడిన జగన్‌రెడ్డి ప్రభుత్వం, అనవసరమైన విధానాలను ప్రవేశపెట్టి విద్యార్థులు, తల్లిదండ్రులను అయోమయంలో పడేసింది. ఐబీ, సీబీఎస్ఈ, ఇంగ్లీష్ మీడియం అంటూ అయోమయ విధానాలతో విద్యార్థులను గందరగోళానికి గురిచేశారు. పాఠశాలల విలీనాలు, తరగతుల మార్పులు విద్యార్థుల చదువును తీవ్రంగా ప్రభావితం చేశాయి. ప్రైవేట్ పాఠ శాలలను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నారు.

పేద పిల్లలకు మంచి విద్యను అందించేందుకు టీడీపీ హయాంలో ప్రవేశపెట్టిన బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని రద్దు చేయడం జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. డిజిటల్ వర్చువల్ క్లాస్‌రూంలు, ఫైబర్ గ్రిడ్ సదుపాయాలను నిర్వీర్యం చేయడం ద్వారా తదుపరి తరం విద్యను ముందుకు తీసుకెళ్లాల్సిన ప్రభుత్వ విధా నాలను జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. ఉపాధ్యాయుల రేషనలైజేషన్ పేరుతో అనేకమంది ఉపాధ్యాయులను బలవంతంగా బదిలీ చేయడం, పాఠశాలల్లో కనీస వసతులు కూడా లేక విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడేలా చేయడంవంటి దారుణమైన విధానాలతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూసుకున్నాయి. ఈ పరిస్థితి కేవలం జగన్‌రెడ్డి ప్రభుత్వంలో మాత్రమే చూడగలం.

ఇక వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 117 ద్వారా ప్రభుత్వ ప్రాథమిక విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసింది. స్కూళ్ల విలీనాలతో విద్యార్థులకు ఇబ్బందులు పెరిగాయి. చిన్న గ్రామాల్లో పాఠశాలలు లేక, విద్యార్థు లు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. పిల్లలకు పోషకాహారం అందించాల్సిన మధ్యాహ్న భోజన పథకం వైసీపీ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైంది. విద్యాకానుక నిధుల దోపిడీ, పిల్లలకిచ్చే చిక్కీలలో కూడా అవినీతి, కనీస మౌలిక వసతులు లేని పాఠశాలలు, నాడు-నేడు పేరిట దోపిడీ చేసి పేద పిల్లలకు విద్యను దూరం చేశాయి. 5 ఏళ్లలో ఒక్క ఉపాధ్యాయుడిని కూడా నియమించకుండా మోసం చేసి, యాప్‌ల పేరిట ఉపాధ్యాయులను వేధించటం, సకాలంలో ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వకపోవటం, ప్రశ్నించిన వారిని మానసిక క్షోభకు గురి చేయటం వంటి నియంత పోకడలతో ఐదేళ్లు పాలన సాగించాడు జగన్‌రెడ్డి.

### విద్యారంగంలో నూతన ఒరవడి

కూటమి ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, 729 నాన్-టీచింగ్, 700 కోయభారతి టీచర్ పోస్టులు భర్తీ చేసింది. జూనియర్ కాలేజీల్లో 700 సిబ్బంది, 3,619 లెక్చరర్ల సేవలు పునరుద్ధరించింది. పాఠశాలల మరియు హాస్టళ్ల పరిస్థితిని మెరుగుపరచేందుకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు చెల్లించి, విద్యార్థులకు సౌకర్యాలు కల్పించింది. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం ద్వారా రూ.953.71 కోట్లు వ్యయంతో కిట్లు అందించారు. పాఠశాలలకు రూ.100 కోట్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.52 కోట్లు మంజూరు చేసి, మెగా పిటియం ద్వారా సమస్యలను పరిష్కరిస్తోంది కూటమి ప్రభుత్వం.

- స్వరూప, అనలిస్ట్

# ప్రణాళికాబద్ధంగా క్రీడల అభివృద్ధి

- అనంతపురంలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడావసతులు
- స్టేడియం ఏర్పాటుకు 15 ఎకరాలు గుర్తింపు
- స్థానిక ఎమ్మెల్యే సాయంతో త్వరలోనే చర్యలు
- క్రీడాకారుల భవిష్యత్తే ప్రభుత్వానికి ముఖ్యం
- శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు



అనంతపురం (చైతన్యరథం): ప్రణాళికాబద్ధంగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అనంతపురం జిల్లాలో క్రీడల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. అనంతపురం డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్ఏ)ని శాప్ ఛైర్మన్ రవినాయుడు సోమవారం సందర్శించారు. తొలుత డీఎస్ఏలోని ఆర్చరీ, ఫెన్సింగ్, కబడ్డీ, వివిధ స్పోర్ట్స్ కోర్టులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్ఏ నిర్వహణ, అభివృద్ధి పనుల పురోగతి, క్రీడావసతుల కల్పనపై ఆరా తీశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనంతపురంలో అత్యుత్తమ క్రీడావసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతపురంలో స్టేడియం ఏర్పాటుకు స్థలాల సమస్య ఏర్పడిందని, మల్టీపర్పస్ స్టేడియం నిర్మాణానికి అనుగుణంగా సెంట్రల్ యూనివర్సిటీ సమీపంలో 15ఎకరాల స్థలాన్ని గుర్తించామని వివరించారు. అయితే స్థల సేకరణలో సాంకేతిక సమస్యలున్నప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నామని, స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్ సాయంతో త్వరలోనే స్టేడియం ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. కేంద్ర ప్రభుత్వం, శాప్ నిధులతో అనంతపురంలో స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అనంతపురం డీఎస్ఏను ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తామని, అనంతపురం క్రీడాకారులకు మెరుగైన క్రీడా సదుపాయాలు కల్పించడమే శాప్ లక్ష్యమన్నారు. ముఖ్యంగా అనంతపురం డీఎస్ఏ అభివృద్ధికి నిర్దిష్టమైన ప్రణాళికలతో డీపీఆర్‌లు సిద్ధం చేశామన్నారు. 2014 నుంచి 2019 మధ్యలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో క్రీడల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం రూ. 27 కోట్లను కేటాయించి క్రీడా వికాస కేంద్రాల (కేవీకే)ల నిర్మాణాలకు శంకుస్థాపనలు, పునాదులు నిర్మించిందన్నారు. కానీ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిని నిర్లక్ష్యం చేసిందని, క్రీడాకారులకు వసతులు లేకుండా ఇక్కట్లకు గురిచేసిందన్నారు. గత వైసీపీ పాలనలో క్రీడారంగానికి గ్రహణం పట్టిందన్నారు. ఇప్పుడు అవే నిర్మాణాలకు కొత్తగా అంచనాలను రూపొందిస్తే వందల కోట్లకు చేరిందని దుయ్యబట్టారు. ఉమ్మడి అనంతపురంలోని ఉరవకొండ, రాయదుర్గం, తాడిపత్రి, కల్యాణదుర్గం, శింగనమల నియోజకవర్గాల్లో క్రీడల పరిస్థితి అధ్వానంగా తయారైందని, క్రీడాకారులకు కనీస వసతులు లేకుండా పోయాయన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని, అత్యుత్తమ క్రీడావసతులతో కేవీకేలు, మల్టీపర్పస్ స్టేడియాల ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం క్రీడారంగాన్ని రాజకీయక్రీడగా మార్చిందని, ఆడుదాం ఆంధ్రా పేరుతో రూ.119 కోట్లను వైసీపీ ప్రభుత్వం కొల్లగొట్టిందన్నారు. క్రీడాకారుల భవిష్యత్తే కూటమి ప్రభుత్వానికి ముఖ్యమని, ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు. దేశంలోనే అత్యుత్తమంగా ఏపీ స్పోర్ట్స్ పాలసీని రూపొందించామని, క్రీడాకారుల ప్రోత్సాహకాలను భారీగా పెంచిన ఘనత ఏపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఏషియన్, ఖేలో ఇండియా, నేషనల్స్ పోటీల్లో రాణించిన క్రీడాకారులకు రూ. 3లక్షలు ప్రోత్సాహకాలను అందిస్తున్నామన్నారు. నేషనల్స్‌లో రాణించిన వారికి యూనిఫాం ఉద్యోగాల్లో డైరెక్ట్ రిక్రూట్మెంట్ కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందన్నారు. ప్రతీ నియోజకవర్గంలోనూ క్రీడావికాస కేంద్రాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టామన్నారు. స్కూల్ స్థాయి నుంచే క్రీడాకారులను తయారుచేయాలనేది విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సంకల్పమన్నారు. ఏపీ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనేది సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆశయమన్నారు.

### యువత ప్రలోభాలకు గురికావొద్దు..

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం యువతను, విద్యార్థులను తప్పుదోవపట్టిస్తుందని, ఫీజుపోరు పేరుతో యువతను రాజకీయంగా వాడుకుంటుందని శాప్ ఛైర్మన్ రవినాయుడు విమర్శించారు. మార్చి 20వ తేదీలోపే కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తుందని, విద్యార్థులు మంచిగా సిద్ధమై అర్హత సాధిస్తే జూన్,జూలై నెలలోనే టీచర్లుగా నియమితులవుతారని వివరించారు. ప్రభుత్వాన్ని విమర్శించడమే వైసీపీ పేటీఎమ్ బ్యాచ్ లక్ష్యమని, దమ్ముంటే ఫీజు రీయింబర్సుమెంటుపై జగన్ ఇంటి ఎదుట ధర్నా చేయాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థుల గొంతుకోసింది జగన్‌రెడ్డేనని, చివరి 4 విడతలు బకాయిలు పెట్టింది ఆయన కాదా అంటూ సూటిగా ప్రశ్నించారు. వైసీపీ నేతలకు సిగ్గు,శరం ఉంటే పోరుబాట కార్యక్రమం జగన్‌మీద చేయాలన్నారు. విద్యార్థులకు రూ. 6వేల కోట్లు చెల్లించకుండా వైసీపీ ప్రభుత్వం బకాయిలు పెట్టిపోతే తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తొలివిడతలో రూ.885 కోట్లు నేరుగా కళాశాలల యాజమాన్యాలకు జమచేసిందన్నారు. ఈ కార్యక్రమానికి ముందు శాప్ ఛైర్మన్ రవినాయుడు ఫెన్సింగ్, కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను తిలకించారు. అనంతరం పలువురు క్రీడాకారులను అభినందించడంతోపాటు జిల్లాలోని క్రీడాకారులు, క్రీడా సంఘాల నిర్వాహకుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.

## గ్రామీణ క్రీడాకారుల అభివృద్ధికి సహకరించండి

**- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు రవినాయుడు వినతి**



గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రీడాకారుల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, దాతలు సహకారం అందించాలని శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆకాంక్షించారు. రాప్తాడు నియోజకవర్గంలోని వెంకటాపురంలో రాప్తాడు ఎమ్మెల్యే శ్రీమతి పరిటాల సునీతను రవినాయుడు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత పరిటాల రవీంద్ర స్మారక ఘాట్ వద్ద టీడీపీ, తెలుగుయువత నాయకులు, గ్రామస్థులతో కలిసి రవీంద్రను స్మరించుకుని నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే సునీతతో కలిసి వారి స్వగృహంలో రవీంద్ర చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల నుంచి అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేయాలనే సంకల్పంతో సీఎం నారా చంద్రబాబు నాయుడు శ్రమిస్తున్నారన్నారు. దేశంలోనే అత్యుత్తమంగా ఏపీ స్పోర్ట్స్ పాలసీని రూపొందించి క్రీడాకారుల భవితకు ప్రభుత్వం భరోసా కల్పించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు అత్యుత్తమ క్రీడాసౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం పీపీపీ మోడ్ విధానాన్ని ప్రవేశపెట్టిందని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, క్రీడాప్రోత్సాహకుల నుంచి సీఎస్ఆర్ నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తుందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రజాప్రతినిధులు కూడా సహకరించాలని ఎమ్మెల్యేను ఆయన కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి క్రీడల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం తీసుకుంటున్న శ్రద్ధ, స్పోర్ట్స్ అథారిటీ చేస్తున్న కృషి పట్ల హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారుల భవిష్యత్తు కోసం ఎమ్మెల్యేగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నియోజకవర్గంలో రాణిస్తున్న అథ్లెటిక్స్ క్రీడాకారులు.. శాప్ ఛైర్మన్, ఎమ్మెల్యేను కలిసి తాము సాధించిన విజయాలను వివరించారు. సందర్భంగా క్రీడాకారులను వారిరువురూ అభినందించి భవిష్యత్తులో మరింత ఉత్సాహంగా రాణించాలని ప్రోత్సహించారు.

## అనంతపురం అర్బన్, మడకశిర ఎమ్మెల్యేలను కలిసిన శాప్ ఛైర్మన్



ఉమ్మడి అనంతపురం జిల్లాలో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో క్రీడావసతులను నెలకోల్పేందుకు ప్రజాప్రతినిధుల సహకారం అవసరమని, దానిలో భాగంగానే సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆయా జిల్లాల్లోని శాసన సభ్యులను, పార్లమెంటు సభ్యులను సమన్వయం చేసుకుంటూ క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు వివరించారు. అనంతపురం నగరంలో ఆదర్శనగర్‌లోని నివాసంలో మడకశిర ఎమ్మెల్యే ఎమ్ఎస్.రాజుతోపాటు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్‌ను సోమవారం శాప్ ఛైర్మన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిరువురితో శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ నియోజకవర్గంలోనూ క్రీడావికాస కేంద్రాల నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. క్రీడల అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, క్రీడా ప్రోత్సాహకులతో సీఎస్ఆర్ నిధుల సమకూర్చాలని కోరుతున్నామన్నారు. దీనిపై ఎమ్మెల్యేలు కూడా సానుకూలంగా స్పందిస్తూ క్రీడాకారుల అభివృద్ధికి తమవంతు సాయశక్తులా కృషి చేస్తామని హామీ ఇవ్వడం పట్ల శాప్ ఛైర్మన్ హర్షం వ్యక్తం చేశారు.

# కళ్లున్న కబోధులు వైసీపీ నేతలు

- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో వైసీపీ నేతలు కావాలనే కూటమి ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై విషం చల్లుతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో అక్రమాలకు పాల్పడిన ఎవరినీ వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. అమరావతిలో సోమవారం రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి వైసీపీ నీలి ముఠాకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ దిగ్గజ కంపెనీలు సైతం క్యూ కడుతున్నాయన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌ల కృషి వల్లే ఏడు నెలల్లో రూ.6.33 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆ కంపెనీలు ముందుకు వచ్చాయని తెలిపారు. అటు అభివృద్ధికి బాటలు వేస్తూనే ఇటు సంక్షేమానికి కూడా కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి చూడలేక వైసీపీ పేటీఎం ముఠాలు కళ్లున్న కబోధుల్లా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకురావటమే కాకుండా, ఇటు రాజధాని అమరావతి, అటు పోలవరం ప్రాజెక్ట్ పనులను సీఎం చంద్రబాబు పరుగులు తీయిస్తున్నారన్నారు. కేంద్ర బడ్జెట్ లో ఏపీకి రికార్డ్ స్థాయిలో కేటాయింపులు జరిగాయని తెలిపారు. ఏపీలో రైల్వేల అభివృద్ధికి 9.147 కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లపై వైసీపీ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని పాతర్ల రమేష్ హెచ్చరించారు.

# కూటమి ప్రభుత్వంతో రైతులకు నిజమైన భరోసా: మంత్రి నాదెండ్ల



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం రైతులకు నిజమైన భరోసా ఇచ్చిందని ఆహార, పౌర సరఫరాల శాఖల మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. 2024-25 ఖరీఫ్ సీజన్లో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ద్వారా చేపట్టిన 31,52,753 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకుగాను రూ.7,222.35 కోట్లు చెల్లించామని వెల్లడించారు. తద్వారా 5,00,352 మంది రైతులకు లబ్ధి చేకూరిందని తెలిపారు. ఇదీ... మా ప్రభుత్వం సాధించిన ఘనత అని సంతోషంగా చెబుతున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రైతుల క్షేమం కోసం నిరంతరం ఆలోచిస్తుంటారని చెప్పడానికి ఇదొక ఉదాహరణ అని ఎక్స్‌లో నాదెండ్ల పోస్ట్ చేశారు. ఈ మేరకు ధాన్యం కొనుగోళ్ల గ్రాఫ్‌ను కూడా పంచుకున్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించండి



అరకు (చైతన్యరథం): మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురంలో కూటమి అభ్యర్థుల సమావేశం స్థానిక ఎమ్మెల్యే విజయచంద్ర అధ్యక్షతన పార్వతీపురం నియోజకవర్గం కురుపాం, సాలూరు, పాలకొండ నియోజకవర్గాల కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, రాష్ట్ర మాజీ మంత్రి రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరకు పార్లమెంట్ అధ్యక్షులు మాజీ మంత్రి రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో రాష్ట్ర ప్రజలు కోరుకున్న ప్రజా ప్రభుత్వం కూటమి ప్రభుత్వం ఏర్పడిందని గత ఎన్నికల్లో వైసీపీని గుణపాఠం చెప్పడానికి అన్నివర్గాల ప్రజలు అందరూ ఏకమై వైసీపీని ఓడించామని గత వైసీపీ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఉద్యోగులకు రైతులకు విద్యార్థులకు కార్మికులకు గత వైసీపీ అన్యాయం చేసిందని అభివృద్ధి సంక్షేమం అందించడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

రాష్ట్రంలో విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబునాయుడు ద్వారానే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని, కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు నిరుద్యోగులకు 20 లక్షల ఉపాధి అవకాశాల కోసం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని అన్నారు.

విదేశాల నుంచి పెట్టుబడులు ఆకర్షించేందుకు ఇటీవల దావోస్‌లో పర్యటించి పెట్టుబడులకు సంబంధించిన పలు ఎంవోలు కుదుర్చుకున్నారని అన్నారు.

రాష్ట్ర రాజధాని అభివృద్ధి చెందాలన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలన్నా నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు రావాలన్నా అది కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని వ్యాఖ్యానించారు. రానున్న టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిత్వాన్ని బలపరిచి గెలిపించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ దిశగా ఓటరుగా ఉన్న ఉపాధ్యాయులతో ప్రతి ఒక్కరూ కలిసి కూటమి అభ్యర్థిత్వాన్ని గెలుపుకు కృషి చేయాలని కిడారి శ్రావణ్ కుమార్ పిలుపునిచ్చారు.

# వెయిట్ లిఫ్టర్‌కు అభినందనలు తెలిపిన సీఎం

విజయనగరం (చైతన్యరథం): ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. ముఖ్యంగా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఏపీకి మెడల్స్ క్యూ కడుతున్నాయి. పురుషుల 67 కిలోల విభాగంలో నీలం రాజు, 71 కేజీల మహిళల విభాగంలో పల్లవి ఇప్పటికే స్వర్ణ పతకాలు గెలుపొందారు. తాజాగా 87 ప్లస్ కిలోల కేటగిరీలో విజయనగరం జిల్లాకు చెందిన టి.సత్యజ్యోతి విజయ ఢంకా మోగించారు. కాంస్యం పథకం సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. కాగా, ఇప్పుడు సత్యజ్యోతికి ప్రశంసలు వెల్లువలా వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ యువ క్రీడాకారిణిని అభినందించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్లు చేశారు.



# వినీలాకాశంలో సిక్కోలవాసుల విహారం



శ్రీకాకుళం (చైతన్యరథం): రథసప్తమి వేడుకలు సందర్భంగా సిక్కోలు నగరంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన హెలికాప్టర్ టూరిజం సిక్కోలు వాసులను అలరించింది. వినీలాకాశంలో జిల్లావాసులు విహరిస్తూ ఆనందంగా గడిపారు. ఆదివారం ఉదయం 9గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, మంచు ప్రభావంతో 11.40 గంటలకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి ప్రారంభించారు. తొలుత కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి హెలికాప్టర్‌లో సిక్కోలు గగనతలంపై విహరించారు. అనంతరం చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు ఉచితంగా హెలికాప్టర్ ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. ముందుగా టిక్కెట్లు బుక్ చేసుకున్న వారు హెలికాప్టర్‌లో ఆకాశ విహారాన్ని ఆనందించారు. ఒకసారి ఆరుగురు చొప్పున్న హెలికాప్టర్‌లో విహరించారు. ఒక్కొక్కరికి టికెట్ రూ.1800 కాగా ఎనిమిది నిమిషాలపాటు ఆకాశంలో సిక్కోలు నగరాన్ని వీక్షించారు.

# రథాన్నెక్కి సూర్యుడు సాగించే ప్రయాణమే రథసప్తమి



భూమిపై జీవరాశులు సుభిక్షంగా మనగలుగుతున్నారంటే అందుకు కారణం సూర్యుడే. ఈ కారణంగానే భానుడిని కనిపించే దేవుడు అని అంటారు. హిందూ సంప్రదాయం ప్రకారం సూర్యాధనకు ఎంతో విశిష్టత ఉంది. ముఖ్యంగా భక్తులు సూర్య జయంతి రోజు ఎక్కువగా పూజిస్తారు. మాఘ మాస శుక్ల పక్షం సప్తమి తిథి నాడు ఈ పర్వదినం వస్తుంది. దీన్నే రథసప్తమి అని కూడా అంటారు. సూర్యుడు ఏడు గుర్రాలపై రథంపై దక్షిణాయనం ముగించి పూర్వోత్తర దిశగా ప్రయాణం సాగిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. అది ఈ రోజు నుంచే ప్రారంభమవుతుంది. మాఘ సప్తమి నుంచి రానున్న ఆరు మాసాలు ఉత్తరాయణ పుణ్యకాలంగా పరిగణిస్తారు. సూర్యుడు ఏడు గుర్రాలు ఏడు వారాలకు సంకేతాలు. ఈ ఏడు గుర్రాలను వేదఛందస్సులు అని అంటారు. గాయత్రి, త్రిష్టుప్, జగతి అనుష్టుప్, పంక్తి, బృహతి, ఉష్ణిక్ అనే ఏడు గుర్రాల రథంపై భానుడు స్వారీ చేస్తాడు. మేషం నుంచి మీనం వరకు ఉన్న పన్నెండు రాశుల్లో ప్రయాణిస్తారు. ఈ 12 రాశులను పూర్తి చేయడానికి సూర్యరథానికి ఏడాది సమయం పడుతుంది. సూర్యజయంతి అంటే సూర్యుడి పుట్టినరోజు కాదు.. రథాన్నెక్కి సూర్యుడు సాగించే ప్రయాణం ఈ రోజు నుంచి మొదలవుతుంది. ఈ ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ రథసప్తమి వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు సిద్ధమైంది.

# పెండింగ్‌లో ఉన్న రైల్వే పనులు చేపట్టండి

● అధికారులను కోరిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



పలాస (చైతన్యరథం): నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే పనులను వెంటనే చేపట్టాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే గౌతు శిరీష దక్షణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ పంక్వాల్‌ను కోరారు. సోమవారం రైల్వే జనరల్ మేనేజర్‌తో శిరీష ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పలాస రైల్ నిలియంలో కలిసి నియోజవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురించి చర్చించారు. పెండింగ్ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధాన సమస్య రైల్వే వంతెన నిర్మాణం పూర్తి చేయాలని, విభిన్న ప్రతిభ వంతులకు స్టేషన్ లో బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేయడంతో పాటుగా... మందస మరియు పూండి రైల్వే స్టేషన్లో హౌరా చెన్నై, విశాఖ ఎక్స్ప్రెస్, బరంపురం విశాఖపట్నం రైలులను నిలపాలని కోరారు. పూరి – తిరుపతి మధ్య నడిచే రైలును పూండిలో నిలపడంతో పాటుగా... పూండి మరియు మందస రైల్ నిలయంలో ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని శిరీష కోరారు. తన డిమాండ్లతో కూడిన పలు సమస్యలను తెలియజేస్తూ వినతిపత్రాన్ని పరమేశ్వర్ పంక్వాల్‌కి అందజేశారు. పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీపీ చైర్మన్ వజ్జ బాబురావు, పిరికట్ల విఠల్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, లోడగల కామేశ్వరరావు, సవర రాంబాబు, చంద్రశేఖర్ త్యాడి, సార నోములు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీని అభినందించిన సీఎం చంద్రబాబు



విజయనగరం (చైతన్యరథం): దేశ రాజధాని ఢిల్లీలో పార్లమెంటు సమావేశాలకు సైకిల్పై హాజరవుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందించారు. టీడీపీ గుర్తు అయిన సైకిల్ మీద పార్లమెంటుకు వెళ్లడం శుభ పరిణామమని, ముఖ్యంగా పర్యావరణహిత కార్యక్రమం చేపట్టారని కితాబిచ్చారు. సోమవారం ఢిల్లీలో సీఎం క్యాంప్ ఆఫీసుకు సైకిల్ మీద వెళ్లిన ఎంపీ కలిశెట్టిని చంద్రబాబు... సహాయకుల ద్వారా అప్పలనాయుడుని పిలిపించుకొని సామాజిక స్పృహ గురించి అడిగి తెలుసుకుని రానున్న రోజుల్లో ప్రజలకు సేవ చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలని, పార్టీకి ఆంధ్రప్రదేశ్‌కు మంచి పేరు తీసుకురావాలని ఎంపీని కోరారు సూచించారు

# ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ

బలిజిపేట (చైతన్యరథం): మండలంలోని గళావల్లి గ్రామంలోని ఉమాసహిత కామలింగేశ్వరాలయంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మంజూరు చేయించిన రూ.32 లక్షల ప్రభుత్వ నిధులతో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులకు ఆ గ్రామ టీడీపీ నాయకులు సోమవారం భూమి పూజ చేశారు. ఆలయం ఆవరణలో కల్యాణమండపం, ఆలయం చుట్టూ ప్రహారీ తదితర అభివృద్ధి పనులకు కోసం ఈ నిధులను ఎమ్మెల్యే విడుదల చేయించారు. ఈ పురాతన దేవాలయం దేవాదాయ, ధర్మాదాయశాఖ పరిధిలో ఉన్నందున ఆలయం, శివలింగం వద్ద ఎలాంటి పనులు చేపట్టకుండా వాటి చుట్టూ ఈ అభివృద్ధి పనులు చేపడతామని టీడీపీ నాయకులు తమరాపు శ్రీనివాస్, దిబ్బ శ్రీను, డోల జనార్ధనరావు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వడపల్లి అప్పలనాయుడు, లక్ష్మునాయుడు, శివలంగి రాము పాల్గొన్నారు.

# రథసప్తమి వేళ కట్టుదిట్టమైన బందోబస్తు

రథసప్తమి వేడుకలకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని మిల్లు జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను డీఐజీ పరిశీలించి, క్రమబద్ధీకరణకు అవసరమైన ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అక్కడ నుంచి నడక మార్గంలో సూర్యనారాయణ స్వామి ఆలయం వద్దకు చేరుకుని మార్గమధ్యలో రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ అంతరం లేకుండా, రోడ్లు మార్గంలో నిలిపిన వాహనాలను ఎప్పటికప్పుడు టోయింగ్ వాహనంతో క్లియర్ చేయించాలన్నారు.

## పేరాబత్తుల రాజశేఖరాన్ని అఖండ మెజార్టీతో గెలిపించండి

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపు
- 11వ డివిజన్‌లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



రాజమహేంద్రవరం(చైతన్యరథం): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరానికి ఓట్లు వేసి అఖండ మెజార్టీతో విజయం చేకూర్చాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) పిలుపునిచ్చారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా స్థానిక 11వ డివిజన్‌లో పరిశీలకులు బోళ్ల వెంకట కృష్ణ ప్రసాద్, కూటమి నాయకులు కాశి నవీన్ కుమార్, అత్తి సత్యనారాయణ, వర్రే శ్రీనివాసరావు, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, వై శ్రీను, పిక్కి నాగేంద్ర, యెనుముల రంగబాబు, కురగంటి సతీష్ తదితర నాయకులతో కలిసి డివిజన్ ఇన్‌ఛార్జ్ కంటిపూడి రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సదరు డివిజన్‌లో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి తమ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి ఓట్లు వేసి గెలుపించాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాజశేఖరానికి ఒక్క అవకాశం ఇస్తే పట్టభద్రుల ప్రయోజనాలను కాపాడుతారన్నారు. నిరుద్యోగుల సమస్యలనూ ప్రభుత్వం దృష్టికి పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. ఏడేళ్ల తర్వాత ప్రజా ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లింపులు, వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. 2023లో టీడీపీ గెలిచిన మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్నే మార్చేశాయన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఏ విధంగా అయితే కృషి చేశారో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా రెట్టింపు స్థాయిలో కృషి చేసి రాజశేఖరానికి విజయం చేకూర్చాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికలకు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు చాలా వ్యత్యాసం ఉంటుందని, ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పేపర్లో పార్టీ సింబల్ ఉండదని.. క్రమ సంఖ్యలో నెంబర్లు ఉండి పేర్లు మాత్రమే ఉంటాయని... కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం పేరు ఎదురుగా ఉన్న గడిలో 1వ నెంబర్ వేసి ఆయనకు అఖండ విజయం చేకూర్చాలని ఓటర్లను కోరారు. ఈ ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థిని గెలిపించండి : కందుల దుర్గేష్



నిడదవోలు (చైతన్యరథం): ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లా ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపు మన అందరి బాధ్యత అని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు లైన్స్ ఆడిటోరియంలో జనసేన ఆధ్వర్యంలో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాజశేఖరం గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో అభ్యర్థి రాజశేఖరం, జనసేన కొవ్వూరు నియోజకవర్గ ఇన్చార్జి టీవీ రామారావు, నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పేదవాడికి కడుపు నింపడమే టీడీపీ లక్ష్యం



జగ్గంపేట (చైతన్యరథం): కాకినాడ రోడ్డులోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద గత మూడు సంవత్సరాలుగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్‌కు ఈవారం జగ్గంపేట మండలం జే కొత్తూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు గొంతిన శేషులు జ్ఞాపకార్థం వారి మనవడు గొంతున సాయి కృష్ణ ఆర్థిక సహాయంతో నిర్వహించారు. ఈ అన్నా క్యాంటీన్‌ను కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ ప్రారంభించారు. పేదవాడి ఆకలి తీర్చాలని తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ స్ఫూర్తితో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జగ్గంపేటలో గత మూడు సంవత్సరాలుగా దాతల సహకారంతో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

# గోపాలపట్నంలో 11 మంది విద్యార్థులకు అస్వస్థత

గోపాలపట్నం (చైతన్యరథం): తీవ్ర దుర్వాసన భరించలేక 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన గోపాలపట్నంలో చోటుచేసుకుంది. విద్యాశాఖ, ఆసుపత్రి వర్గాలు తెలిపిన వివరాల మేరకు.. జీవీఎంసీ 92వ వార్డు హరిజన వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్. రాజు, వి.యశ్వంత్, ఏ సౌమ్య, జె దివ్య, ఎన్ తే స్వరూప్, పి వైష్ణవి, ఎన్ కౌశిక్, జి నాగ ప్రసన్న, ఎం హేమని, పూజ, ఉష,లాస్య ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఈనెల ఒకటో తేదీన శనివారం తరగతి గదిలో తీవ్ర దుర్వాసన రావడంతో ఐదుగురు విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. సోమవారం స్కూల్‌కి వచ్చిన వెంటనే విద్యార్థులకు అదే తరగతి గదిలో దుర్వాసన రావడంతో 11 మంది విద్యార్థులు వాంతులు అవ్వడం కళ్ళు తిరిగి పడిపోవడంతో తక్షణ ఉపాధ్యాయులు స్పందించి హాస్పిటల్కు తరలించారు. గోపాలపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. గోపాలపట్నం మండల ఎమ్మార్వో సిహెచ్ వి రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి పి.జగదీశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిపై ఆరా తీస్తున్నారు.



# కూటమి అభ్యర్థి పేరాబత్తుల విజయానికి కృషి చేయాలి

పిఠాపురం (చైతన్యరథం): ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల మాదిరిగానే ఉభయ గోదావరి పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్ని కల్లో రికార్డుస్థాయి మెజార్టీతో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయం సాధించేందుకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పి.గోవింద సత్యనారాయణ సూచించారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై నియోజకవర్గ స్థాయిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కూటమి నాయకులతో కలిసి ప్రతి ఓటరు వద్దకు వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించి ప్రథమ ప్రాధాన్యత ఓటును వేయాలని అభ్యర్థించాలని తెలిపారు. ఓటర్ వెరిఫికేషన్ ఇప్పటికి 60శాతం పూర్తయిందని, నూరుశాతం పూర్తి చేయాలని సూచించారు. నాన్ లోకల్ ఓటర్లును గుర్తించి వారిని కలిసే కార్యక్రమం చేపట్టాలన్నారు. వర్మ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న పట్టబద్రుల ఓటర్ల మొబైల్ నెంబర్లు సేకరించామన్నా రు. ప్రతి 30మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని నియమించి వారిని నిరంతం కలిసేలా ఏర్పాటు చేశామని తెలిపారు. పార్టీ ప్రతినిదులున్నారు.



# ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు.. పెద్దల సభకు అలంకారం

- ఆలపాటి గెలుపు లాంఛనమే.. మెజార్టీ ముఖ్యం
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం



గుడివాడ (చైతన్యరథం): ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు.. పెద్దల సభకు అలంకారమని ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావ్ అన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ను బలపరుస్తూ సోమవారం పోరంకిలోని మురళీ రిసార్ట్స్‌లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అధ్యక్షతన గన్నవరం పట్టభద్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కొల్లు రవీంద్ర, కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, కూటమి నేతలు, తెలుగు యువత, పార్టీ కార్యకర్తలు, పట్టభద్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ మెజార్టీ ఓట్లు పోల్ అయ్యేలా తెలుగుయువత సభ్యులు పనిచేయాలని సూచించారు. అప్పుడే ఎక్కువ మెజార్టీ సాధ్యమవుతుందని వెల్లడించారు. ఆలపాటి గెలుపు లాంఛనమే అని అన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌కు ఎంతో సన్నిహితంగా వున్నారని గుర్తు చేశారు. పెద్దల సభకు ఆలపాటి రాజేంద్రప్రసాద్ వెళ్తే సభకు అలంకారమని అన్నారు. ప్రపంచంలో తెలుగువారు ఎక్కడ ఉన్న అందులో ప్రథమంగా గన్నవరం నియోజకవర్గ ప్రజలు ఉంటారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని మెజార్టీని తనకు ఇచ్చారని నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటానని చెప్పారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని చెప్పారు. గత ప్రభుత్వం అభివృద్ధిని అడ్డుకుందని విమర్శించారు. పరిశ్రమలు తరలివెళ్ళిపోయాయని, అంతర్జాతీయ విమానాశ్రయం సమీపాన ఉన్న ఆసుపత్రి దుస్థితి గత ప్రభుత్వ పాలనకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. అభివృద్ధి గురించి తెలియని ప్రభుత్వానికి, అభివృద్ధి అంటే ఏంటో తెలిసిన ప్రభుత్వానికి తేడా ఆరునెలల పాలనలోనే ప్రజలకు అర్థమయ్యిందన్నారు. అలాంటి అభివృద్ధి చేస్తున్న కూటమి అభ్యర్థి ఆలపాటిని అఖండ మెజార్టీతో గెలిపించాలని గన్నవరం నియోజకవర్గం నుండి అత్యధిక మెజార్టీ ఇవ్వాలని పట్టభద్రులకు ఎమ్మెల్యే యార్లగడ్డ పిలుపునిచ్చారు.

# చిల్లర రాజకీయం చేస్తున్న వైసీపీ... మండిపడ్డ టీడీపీ ఎంపీ



తుని (చైతన్యరథం): ముద్రగడ ఇంటిపై ఆకతాయి దాడిని వైసీపీ రాజకీయం చేయడం నీచమని ఎంపీ సానా సతీష్ వాఖ్యానించారు. దాడి చేసిన వ్యక్తి ఒకప్పుడు ముద్రగడ అనుచరుడేనని, ఏవో వ్యక్తిగత లావాదేవీ గొడవలతో దాడికి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఆకతాయి చేసిన దాడిని ముద్రగడపై దాడిలా వైసీపీ రాజకీయం చేస్తోందని.. ఈ డ్రామాపై జనం నవ్వు కుంటున్నారని ఎద్దేవా చేశారు. లేనిదానికి వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ముద్రగడకు ఫోన్ చేయడం చూస్తుంటే అంతా వైసీపీ ఆడిస్తున్న డ్రామాగా అర్థమవుతోందని చెప్పారు. ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయిన వైసీపీని ఈ డ్రామాలతో ఇంకా పాతాళంలోకి పడి పోతుందన్నారు. గత పాలనలో వైసీపీ పాపాలు రోజుకొకటి బయటపడుతుండటంతో ఈ చిల్లర ప్రచారం చేస్తున్నారని టీడీపీ ఎంపీ సానా సతీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ముద్రగడ కాంపౌండ్‌లో పార్కింగ్ చేసిన కారుతో పాటు ఫ్లెక్సీలను గన్నిశెట్టి గంగాధర్ అనే యువకుడు ధ్వంసం చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ముద్రగడ నివాసానికి చేరుకుని గంగాధర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. దీని వెనుక ఎవరైనా ఉన్నారా.. లేక గంగాధర్ కావాలనే ముద్రగడ నివాసం వద్ద భీభత్సం సృష్టించాడా అనే విషయంపై కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు.

# అభివృద్ధే కూటమి అభిమతం : కేంద్రమంత్రి పెమ్మసాని

గుంటూరు (చైతన్యరథం): 'వైసీపీ కార్పొరేటర్లను పార్టీలో చేర్చుకోవడం ఇష్టం లేకపోయినా, అందులోని నిజాయితీపరుల ప్రవర్తనతో తీసుకున్నాం. వైసీపీలో కొందరు 3 వంతెనల నిర్మాణానికి అడ్డుపడుతుండగా ఇంకొందరు మాత్రం నగరాభివృద్ధిని బలంగా కాంక్షిస్తున్నారు. అందులో భాగంగానే వైసీపీలోని పలువురు నిజాయితీపరులైన కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ చేస్తున్న అభివృద్ధికి ఓటు వేశారు.' అని గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖల కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఢిల్లీలోని ఎన్నికల ప్రచారం పూర్తి చేసుకున్న పెమ్మసాని... గుంటూరులోని స్టాండింగ్ కమిటీ ఎన్నికల ఫలితాలను స్థానిక అధికారులు, నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్నారు. జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టీడీపీతో పాటు కొందరు వైసీపీ కార్పొరేటర్లు కూడా టీడీపీకి అనుకూలంగా ఓటింగ్ చేయడం జరిగింది. అయితే నగరాభివృద్ధిని కోరుకుంటూ, అభివృద్ధిలో తాము భాగస్వాములు అవ్వాలని భావించే వైసీపీలోని కొందరు నిజాయితీపరులే స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు మద్దతుగా నిలిచారని ఆయన తెలిపారు. చాలామంది కార్పొరేటర్లు గుంటూరుకు దశాబ్దాల కల అయిన శంకర్ విలాస్ ఆర్ ఓ బి తో పాటు ఇటీవలే తాము మంజూరు చేయించిన తక్షణ 2 వంతెనల మంజూరు, నిర్మాణాలను కూడా జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఈ క్రమంలో ఆయా నిర్మాణాలకు ఎన్నో ఆటంకాలు సృష్టించే ప్రయత్నం చేశారన్నారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా నగరాభివృద్ధిని అడ్డుకోలేరని స్పష్టం చేశారు.

# ప్రజల ఆకాంక్షల మేరకే ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయం

●ఎమ్మెల్యే గళ్ళా మాధవి కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సభ్యులకు సత్కారం



గుంటూరు (చైతన్యరథం): నగర ప్రజల ఆకాంక్షల మేరకే స్టాండింగ్ కమిటీ ఎన్నికలలో ఎన్డీయే కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న ఎన్నికల సరళిని ఎమ్మెల్యే మాధవి పరిశీలించి, కార్పొరేటర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... నగర పాలక సంస్థలో జరుగుతున్న స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి బలపర్చిన అభ్యర్థులు ఈరంటి వర ప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, నూకవరపు బాలాజీ, ముప్పవరపు భారతి, షేక్ మీరావలి, దాసరి లక్ష్మి, దుర్గ గెలుపొందారని వారందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నాను. గడిచిన 5ఏళ్ల కాలంలో నగర అభివృద్ధికి వైసీపీ తిలోదకాలు దిద్దిందని, గుంటూరును గుంటలూరుగా మార్చి ప్రజలకు అభివృద్ధిని, కనీస సౌకర్యాలకు దూరం చేసిందని మండిపడ్డారు. ఎన్డీయే కూటమి ఇటు రాష్ట్రంలో గానీ, నగరాభివృద్ధికి కట్టుబడి అనేక ఏళ్ల నాటి సమస్యలను పరిష్కారించేందుకు కృషి చేస్తుందన్నారు. కూటమి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులైయారు క కాబట్టే పలువురు వైసీపీ కార్పొరేటర్లు తమ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇచ్చి, ఎన్డీయే కూటమి పార్టీల్లో చేరారని అన్నారు. అనంతరం గెలుపొందిన స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, మొహమ్మద్ నసీర్, బూర్ల రామాంజనేయులు, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్‌లు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కోవెలమూడి రవీంద్ర, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, మానం పద్మ శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ దేశంలోనే నెంబర్ వన్‌గా ఎదగాలన్నదే ప్రజల ఆకాంక్ష : ప్రత్తిపాటి



నరసరావుపేట (చైతన్యరథం): కూటమి ప్రభుత్వ ఏడు నెలల పాలనా విజయాలు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గొప్ప ఆలోచనల గురించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీయే లక్ష్యంగా కూటమినేతలు ఐకమత్యంగా, సమన్వయంతో పనిచేయాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పిలుపునిచ్చారు. సోమవారం నరసరావుపేట పట్టణంలోని నవయుగ కన్వెన్షన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ– కూటమి పార్టీల సమన్వయం.. సన్నద్ధత, ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన సమీక్ష పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పల్నాడు జిల్లా ఎమ్మెల్యేలు, మూడు పార్టీల శ్రేణుల నాయకుల సమావేశంలో పాల్గొని ప్రత్తిపాటి కీలకసూచనలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుకంటే, భారీ మెజారిటీయే ప్రధానలక్ష్యంగా కూటమినేతలు పనిచేయాలని పుల్లారావు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు భేషజాలకు పట్టింపులకు పోకుండా ఐకమత్యంగా సమన్వయంతో పనిచేస్తే ఏ ఎన్నికల్లోనైనా విజయం సునాయాసమే అవుతుందన్నారు. మన ఎమ్మెల్సీ అభ్యర్థిగా, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోటీ చేయడం అందరం గర్వించాల్సిన విషయమని, ఆయనకు పల్నాడు జిల్లాలో ఎక్కువ మెజారిటీ వచ్చేలా అందరం పట్టుదలతో పనిచేద్దామని పుల్లారావు పిలుపునిచ్చారు.

# గోమాతను రక్షించుకోవడం సనాతన ధర్మం : మంత్రి నిమ్మల



మంగళగిరి (చైతన్యరథం): సనాతన ధర్మంలో గోమాతను పూజించడం, రక్షించడం, కాపాడడం, పెంచుకోవడం ద్వారా సేవచేయడం పుణ్య కార్యక్రమంతో పాటు ఆరోగ్యవంతంగా మెలుగుతామని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. గోమాతను రక్షించుకునేలా ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజల్లో అవగాహన కల్పిస్తోందని అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం పెదవడ్లమూడి గ్రామంలో భగవాన్ శ్రీసత్య షిర్డీ సాయిబాబా మందిరం 19వ వార్షికోత్సవంలో పాల్గొన్న మంత్రి నిమ్మల షిర్డీసాయిబాబా ఆశీస్సులు పొందారు. ఈసందర్భంగా దేవస్థానం నిర్వాహకుల ఆధ్వర్యంలోని గోమాత ఆర్గానిక్ డైరీ ఫామ్‌ను సందర్శించిన మంత్రి స్వయంగా గోవులకు గ్రాసం అందించారు. తానూ ఒక రైతు కుటుంబం నుండి వచ్చిన వాడినేనని, గోమాత విలువ తనకు బాగా తెలుసని గోవుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈసందర్భంగా దేవస్థాన నిర్వాహకులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి, భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల సహకారంతో రాష్ట్రం అభివృద్ధిపథంలో పరుగులు పెడుతుందన్నారు. విజన్ 2047 లక్ష్య సాధన దిశగా అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తయ్యి, ప్రాజెక్టుల్లో జలకళ సంతరించుకుని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని సాయిబాబాను ప్రార్థించానని మంత్రి నిమ్మల తెలిపారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ, 19 ఏళ్లుగా దేవస్థాన వార్షికోత్సవాలు నిర్వహిస్తుండటం ఎంతో సంతోషంగా ఉందంటూ నిర్వాహకులను మంత్రి అభినందించారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంచి మెజార్టీ సాధించాలి

●నరసరావుపేటలో కూటమి సమన్వయ కమిటీ సమావేశం



వినుకొండ (చైతన్యరథం): రాష్ట్రంలో రానున్న రోజుల్లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ కొట్టేలా ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల విజయం ఆధిక్యాలు ఉండాలని నాయకులు, శ్రేణులకు పిలుపునిచ్చారు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. ఉమ్మడి కృష్ణా – గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఇంకా మూడు వారాలే ఉందని.. ఈ తక్కువ సమయంలో ఎక్కువ బాధ్యతగా కలిసి పనిచేద్దామని విజ్ఞప్తి చేశారు. నరసరావుపేటలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. తెలుగుదేశంపార్టీ పల్నాడు అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, యరపతినేని శ్రీనివాసరావు, భాష్యం ప్రవీణ్, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, చదలవాడ అరవిందబాబు, జనసేన, బీజేపీ నాయకులు, ఏడు నియోజకవర్గాల టీడీపీ పరిశీలకులు, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన జీవీ... ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించే బాధ్యత అందరిపై ఉందన్నారు. స్థానికంగా లేనివారితో కూడా మధ్యమధ్యలో మాట్లాడుతూ ఉండాలని సూచించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో టెలి కాన్ఫరెన్స్ వంటివి ఏర్పాటు చేస్తే సంబంధిత నియోజకవర్గం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అభ్యర్థి మాట్లాడడానికి అవకాశం ఉంటుందన్నారు. వినుకొండ నియోజవర్గంలో సుమారు 7,600 పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని, వాటిల్లో సింహభాగం కూటమి అభ్యర్థికే వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు గ్రామాల్లో 30% పట్టణ పరిధిలో 70%ఉన్నారని అది గమనించి పట్టణ ఓటర్లపై ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో ఉండేవారు ఏ పార్టీకి ఆ పార్టీ ముందు నిర్ణయం తీసుకుని ఉంటే.. మున్సిపల్ పరిధిలోని ఓటర్లు ఎక్కువ న్యూట్రల్‌గా ఉంటారని, అందుకే వారిని ఎక్కువ కలవాలన్నారు. వారిలో అంశాల వారీ నిర్ణయం తీసుకునే స్వభావం ఉంటుందని..తద్వారా ఎక్కువ పోలింగ్ చేయించుకోవడానికి వీలు ఉంటుందని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అభిప్రాయపడ్డారు.

# టీడీపీ ప్రధాన కార్యదర్శి కూచిపూడి సుబ్బయ్య మృతి బాధాకరం



గన్నవరం (చైతన్యరథం): నియోజకవర్గం టీడీపీ ఎస్సీసెల్ కార్యదర్శి, మాదలవారిగూడెం గ్రామ టీడీపీ ప్రధాన కార్యదర్శి కూచిపూడి సుబ్బయ్య (మాష్టారు) సోమవారం ఉదయం రామవరప్పాడు రింగ్‌రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ ఘటన టీడీపీ శ్రేణులను ఆయన కుటుంబాన్ని తీవ్ర విషాదంలో ముంచింది. సమాచారం తెలుసుకున్న గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు హుటాహుటిగా మాదలవారిగూడెం గ్రామానికి వెళ్లి సుబ్బయ్య పార్థీవదేహాన్ని సందర్శించారు. ఆయనకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ... సుబ్బయ్య పార్టీకి చేసిన సేవలు మరువలేనివని, ఆయన మరణం పార్టీకి తీరని లోటు అని అన్నారు. కూచిపూడి సుబ్బయ్య (మాష్టారు) అకాలమరణం గన్నవరం నియోజకవర్గ టీడీపీ శ్రేణులను శోకసంద్రంలో ముంచిందన్నారు. సుబ్బయ్య మాష్టారు కుటుంబాన్ని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు అంతిమ వీడ్కోలు పలికారు.

# ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య సోమవారం ప్రారంభించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో గ్రౌండ్‌లో జగ్గయ్యపేట క్రికెట్ కమిటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగ్గయ్యపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక నేతలతో కలిసి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, దొంతు చిన్న, శ్రీరాం చిన్నబాబు, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ప్రారంభించారు. క్రీడల వల్ల స్నేహ సంబంధాలు పెరుగుతాయని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయిన వారు నిరుత్సాహపడకుండా మళ్లీ గెలిచేందుకు కృషి చేయాలన్నారు.



# ఫలించిన నారాయణ మంత్రం

◆నెల్లూరు డిప్యూటీ మేయర్‌గా మైనారిటీ మహిళ

◆కార్పొరేషన్ చరిత్రలో తొలిసారి

◆మేలోగా తల్లికి వందనం, రైతు భరోసా

◆మునిసిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ



నెల్లూరు, (చైతన్యరథం) : నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో మునిసిపల్ శాఖా మంత్రి నారాయణ వేసిన మంత్రం సత్ఫలితాలిచ్చింది. మంత్రి నారాయణ సూచనలతో నెల్లూరు కార్పొరేషన్ చరిత్రలో తొలిసారి మైనార్టీ మహిళా కార్పొరేటర్‌కు డిప్యూటీ మేయర్ పదవిదక్కింది. డిప్యూటీ మేయర్‌గా ఎంపికైన సయ్యద్ తహసీన్ను పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అభినందించారు.మంత్రి నారాయణ చేతుల మీదుగా డిప్యూటీ మేయర్ తహసిన్ ధ్రువపత్రం అందుకున్నారు. మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ వ్యూహాత్మక అడుగులతో తెలుగుదేశం పార్టీ బలపరిచిన నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ అభ్యర్థి సయ్యద్ తహసీన్ ఘన విజయం సాధించారు. నెల్లూరు కార్పొరేషన్ సమావేశ మందిరంలో జరిగిన ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది. మొత్తం 54 మంది కార్పొరేటర్లలో 41 మంది కార్పొరేటర్లు చేతులెత్తే ఎన్నికల ప్రక్రియ ద్వారా తహసీన్‌కు తమ మద్దతు ప్రకటించారు. ఎన్నికల అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె కార్తీక్ తహసీన్ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైనట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ మంత్రి నారాయణ ముస్లిం మైనార్టీ మహిళను డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. రానున్న నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి గొప్ప విజయాన్ని అందించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్లు సమస్యల పరిష్కారానికి ప్రజలతో మమేకమవ్వాలన్నారు. రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, గత ప్రభుత్వం చేసిన అప్పులకు ప్రస్తుత ప్రభుత్వం నుండి రిజర్వ్ బ్యాంక్ వసూలు చేస్తోందని వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్పటికీ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. 68 లక్షల మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందించడమే కాకుండా రూ. 3 నుండి 4 వేలకు పెంచామన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు అందించామన్నారు. మేలోగా తల్లికి వందనం, రైతు భరోసా అందిస్తామన్నారు. రైతు భరోసాలో 10 వేలు రాష్ట్ర ప్రభుత్వం 10 వేలు కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. 2019లో కేంద్రం స్వచ్ఛభారత్, అమృత పథకాల నిధులిస్తే అప్పటి వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. కేంద్రం శాతం నిధులను అందిస్తే 30శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉండగా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు నెల్లూరును అభివృద్ధి చేశానన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం తీసుకొచ్చానని అందులో 90 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ప్రభుత్వం మారడంతో పది శాతం పనులు ఆగిపోయాయన్నారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో డ్రెయిన్‌లు, రోడ్లు, పార్కులు తదితర ఆధునీకరణ పనులు వేగవంతం చేస్తామన్నారు. నెల్లూరు నగరంలో 54 డివిజన్లో అందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ తరపున డిప్యూటీ మేయర్ అభ్యర్థిని గెలిపించుకోవడం శుభపరిణామమన్నారు. మంత్రి నారాయణ వంటి అనుభవం ఉన్న నాయకులతో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. మంత్రి నారాయణ సూచనలతో అందరి సహకారంతో విజయం సాధించామని నుడ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేష్ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తామని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి అన్నారు. నెల్లూరు కార్పొరేషన్‌లో చరిత్ర సృష్టించామన్నారు. మంత్రి నారాయణ సూచనలతో తొలిసారిగా డిప్యూటీ మేయర్ పదవికి మైనార్టీ మహిళను నిలబెట్టి విజయం సాధించామన్నారు. వైసీపీలో ఉన్న 12 మందిలో ఇద్దరు గైర్హాజరవడం, ఆ పార్టీ పరిస్థితి ఏమిటో అర్థమవుతుందన్నారు. డిపాజిట్లు కోల్పోయిన వైసీపీ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు.



# నిన్నూ.. నీ కుటుంబాన్ని ఆదుకుంటా

◆కన్నీటి పర్యంతమైన మంగమ్మకు ధైర్యం చెప్పిన మంత్రి నారాయణ

◆సొంత నిధులతో వైద్య ఖర్చులన్నీ భరిస్తానని హామీ

నెల్లూరు, (చైతన్యరథం) : నగర పరిధిలోని తొమ్మిదో డివిజన్ కుసుమ హరిజనవాడకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ మహిళ నాయకురాలు సీహెచ్ మంగమ్మ ఇటీవల క్యాన్సర్ బారిన పడి అనారోగ్యానికి గురి కావడంతో చలించి పోయిన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షులు, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తో కలిసి సోమవారం ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. పార్టీ సీనియర్ నాయకురాలు మంగమ్మ అనారోగ్యానికి గురి కావడం బాధ కలిగించిందని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటానని భరోసా కల్పించారు. మంగమ్మ కుటుంబ సభ్యులకు మంత్రి నారాయణ చెక్కు రూపంలో ఆర్థిక సాయం అందించారు. గత ఎన్నికల్లో తన గెలుపు కోసం మంగమ్మ ఎంతో కష్టపడి పని చేశారని ఈ సందర్భంగా మంత్రి నారాయణ గుర్తు చేసుకున్నారు. కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని, మంగమ్మ వైద్యానికయ్యే ఖర్చు మొత్తాన్ని తానే భరిస్తానని నారాయణ హామీ ఇచ్చారు.

# ఇది చంద్రబాబు సంక్షేమ పాలన విజయం

◆టీడీపీ ఖాతాలో బుచ్చి వైస్ చైర్మన్ పదవి

◆కింగ్ మేకర్‌గా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, (చైతన్యరథం) : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతి వైస్ చైర్మన్ల ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన 8వ వార్డు కౌన్సిలర్ పఠాన్ నస్రీన్ ఖాన్, 9వ వార్డు కౌన్సిలర్ యరటపల్లి శివకుమార్ రెడ్డి వైస్ చైర్మన్లుగా ఎన్నికయ్యారు. మొత్తం 20 మంది కౌన్సిలర్లు వున్న బుచ్చి నగర పంచాయతీలో టీడీపీ బలపరిచిన పఠాన్ నస్రీన్ ఖాన్, యరటపల్లి శివకుమార్ రెడ్డి వైసీపీ వైస్ చైర్మన్ అభ్యర్థులు కందుకూరు యానాది రెడ్డి, ప్రమీలమ్మలపై 14 ఓట్ల మెజారిటీతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి ఎల్ శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఎక్స్ అఫీషియో సభ్యురాలి హోదాలో తమ ఓటు హక్కు వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ బుచ్చి నగర పంచాయితీ వైస్ చైర్మన్ల గెలుపును ముఖ్యమంత్రి చంద్రబాబు విజయంగా అభివర్ణించారు.



# వైసీపీకి బుద్ధొచ్చేలా టిడ్కో ఇళ్లకు కొత్త వెలుగు

శ్రీకాళహస్తి (చైతన్యరథం) : పట్టణంలోని న్యూ ఎన్టీఆర్ నగర్( టిట్కో ఇండ్లు) లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమానికి వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిట్కో హౌసింగ్‌కార్పొరేషన్ చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్‌ను టీడీపీ పట్టణ అధ్యక్షుడు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి దాదాపు 7 వేల ఇండ్లను శ్రీకాళహస్తి పట్టణానికి మంజూరు చేస్తూ పట్టణంలో ఒక్కరు కూడా పూరి గుడిసెలో ఉండకూడదని ప్రతి ఒక్కరూ మంచి ఇంటిలో ఉండాలని ప్రయత్నించారన్నారు. ఫేస్ వన్ లో 2619 ఇండ్లను నిర్మించి లబ్ధిదారులకు మంజూరు చేశాడని ఆ ఇండ్లలో మౌలిక వసతులు కల్పించే క్రమంలో ప్రభుత్వాలు మారటంతో లబ్ధిదారులకు ఇవ్వలేకపోయామన్నారు. ఇప్పుడు మంచి కూటమి ప్రభుత్వం వచ్చిందని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఈ టిట్కో ఇండ్లను పరిశీలించి తొందర్లో లబ్ధిదారులకు అందరికీ ఇల్లు ఇచ్చే ఏర్పాటు చేస్తానని తెలియజేశారన్నారు. ఎన్నికల ముందు వారికి మాట ఇవ్వడంతో ఈరోజు అది రూపు దాల్చుకుంటుందని కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎవ్వరికి కూడా ఒక్క ఇల్లు ఇవ్వలేదని ఈ మంచి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొందరలో ఇల్లు ఇస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీవీ, బీజేపీ, జనసేన నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# మంత్రి నారాయణ నెట్‌వర్క్

◆ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తే.. అంతలోనే సమస్య పరిష్కారం

దగదర్తి, (చైతన్యరథం) : నెల్లూరు సిటీ 44వ డివిజన్ బూత్ నెంబర్ 80 బెస్తవీధిలో సుమారు సంవత్సరం కాలంగా కరెంటు సర్వీస్ వైర్లు అన్ని కిందికి వేలాడుతూ వుచ్చిపోయే స్థానికులకు తగిలే పరిస్థితి ఉంది అవి తగిలితే కరెంటు షాక్ కొట్టి చనిపోయే పరిస్థితి కూడా ఉంది. స్థానికుల ఫిర్యాదుల మేరకు మునిసిపల్ శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణకు ఆన్లైన్ కంప్లైంట్ ద్వారా తెలియజేశారు. తెలియచేసిన వెంటనే కరెంట్ డిపార్ట్మెంట్ వాళ్లు వచ్చి కరెంటు వైర్లను పైకి లాగి కట్టి ఎటువంటి ఇబ్బంది లేకుండా స్థానికులకు చేయడం వల్ల స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# నిలిచిపోయిన స్ట్రైవ్ పథకం

◆లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నకు కేంద్రమంత్రి వివరణ

నెల్లూరు, (చైతన్యరథం) : కేంద్ర ప్రభుత్వం స్ట్రైవ్ ప్రాజెక్టు కింద అందుతున్న సదుపాయాలు ఏంటని నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభలో సోమవారం ఆరా తీశారు. ప్రాజెక్టు కింద నెల్లూరు ప్రభుత్వ ఐటీఐలో రెండు తడ ప్రభుత్వ ఐటీఐలో ఒకట ఉన్నాయని వాటిలో నైపుణ్యాలను బలోపేతం చేయడం, లెర్నింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు, వసతుల కల్పనను అందించడానికి ఎంపిక చేశారన్నది వాస్తవమేనా అని ప్రశ్నించారు. వీటికి కేటాయించిన, మంజూరు చేసిన, విడుదల చేసిన, ఖర్చు చేసిన నిధుల గురించి ఆరా తీశారు. అలాగే ఇతర ఐటీఐలను ఈ ప్రాజెక్టు కిందను తీసుకువచ్చేందుకు కేంద్రం కృషి చేస్తోందా అని అడిగారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఈ ప్రాజెక్టు కింద దేశవ్యాప్తంగా మొత్తం 500 ఐటీఐల్లో (వీటిలో 467 ప్రభుత్వ, 33 ప్రైవేట్ ఐటీఐల్లో ఉన్నాయి) ఎంపికయ్యాయన్నారు. ఈ ఐటీఐలను ప్రపంచ బ్యాంకు సహాయంతో భారత ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు. ఈ ప్రాజెక్ట్ కింద లెర్నింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను బలోపేతం చేయడానికి, అప్గ్రేడ్ చేయడానికి, మెరుగుపరచడానికి నెల్లూరులోని రెండు ప్రభుత్వ ఐటీఐలు, తడలోని ఒక ప్రభుత్వ ఐటీఐ గుర్తించబడ్డాయని పేర్కొన్నారు. నెల్లూరులోకి ఐటీఐలకు ఒక్కోదానికి రూ.1.43 కోట్ల నిధులు కేటాయించగా, తడ ఐటీఐకి రూ.1.23 కోట్లు అందించినట్లు వివరించారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ మెకానిక్ వెహికల్ , ఎలక్ట్రానిక్ మెకానిక్, ఆర్ ఆండ్ ఏసీ, వెల్డర్ వంటి వివిధ ట్రేడ్లలో తాజా ఉపకరణాలు, పరికరాలు, యంత్రాల సేకరణ కోసం రాష్ట్రాలు ఈ నిధులను ఉపయోగించాయని వివరించారు. ఇక ఈ ప్రాజెక్ట్ ను 31 మే, 2024 నుంచి అమలు చేయడం లేదని వివరించారు.

### ఏపీలో ఏపీవై ప్రయోజనమెంత

సోమవారం పలు అంశాలపై ఆయన లోక్‌సభలో ప్రశ్నలు వేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అటల్ పెన్షన్ యోజన పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్లో ప్రత్యేకించి నెల్లూరు జిల్లాకు కలుగుతున్న ప్రయోజనాలపై ఆరా తీశారు. ఏపీవై కింద ప్రయోజనాలను బదిలీ చేయడంలో ఎదురవుతున్న సవాళ్లపై ప్రశ్నించారు. అలాగే లబ్ధిదారులే లక్ష్యంగా పన్ను చెల్లింపుదారులను ఈ పథకం నుంచి తొలగించింది వాస్తవమేనా అని ఆరా తీశారు. కనీస గ్యారెంటీ పెన్షన్ మొత్తాన్ని పెంచాలని ప్రభుత్వం ప్రతిపాదించిందా అని అడిగారు.



ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. కేంద్ర ప్రభుత్వం పేదలు, అసంఘటిత రంగంలోని కార్మికుల కోసం సామాజిక భద్రతా వ్యవస్థను రూపొందించే లక్ష్యంతో 2015లో అటల్ పెన్షన్ యోజన పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఆదాయపు పన్ను చెల్లింపుదారు పథకంలో చేరడానికి అర్హులు కాదని 2022లో నిర్ణయించినట్లు చెప్పారు. ప్రస్తుతం పథకం కింద పెన్షన్ రూ. 1000 నుంచి 5000 వరకు పింఛను అందుతుందన్నారు. అటల్ పెన్షన్ యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనతో పాటు ప్రత్యేకంగా పేదలు, వెనుకబడిన వారి కోసం సామాజిక భద్రతా వ్యవస్థను రూపొందించామన్నారు.





# హిందూపురం మున్సిపాల్టీ టీడీపీ కైవశం

**◆ఓటు వేసిన ఎంపీ పార్థసారధి, ఎమ్మెల్యే బాలకృష్ణ**

**◆చైర్మన్ ఎన్నికపై ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక దృష్టి**

హిందూపురం (చైతన్యరథం): శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం మున్సిపల్ చైర్మన్ పదవి తెలుగుదేశం పార్టీ కైవశం అయింది. చైర్మన్‌గా ఆరవ వార్డు కౌన్సిలర్ రమేష్‌కుమార్‌ను కౌన్సిలర్లు ఎన్నుకున్నారు. చైర్మన్ పదవి కోసం సోమవారం ఈ ఎన్నిక రసవత్తరంగా సాగింది. 13 మంది కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరడంతో తెలుగుదేశం పార్టీ గెలుపు ఖాయమైంది. దీంతో టీడీపీ నేతలు, కౌన్సిలర్లు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. హిందూపురం మున్సిపాల్టీలో మొత్తం వార్డులు 38 ఉండగా చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో 38 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. 21 మంది కౌన్సిలర్లతో పాటు ఎంపీ, ఎమ్మెల్యే మద్దతుతో చైర్మన్‌గా రమేష్‌కుమార్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆర్డీవో ఆనంద్ కుమార్ ప్రకటించారు. ఇదిలావుండగా హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక దృష్టిసారించారు.

హిందూపురం మున్సిపాల్టీలో మొత్తం 38 వార్డులకు గాను ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి టీడీపీ, బీజేపీ బలం 10 కాగా.. 13 మంది కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. దీంతో టీడీపీ బలం 23కు చేరింది. వైఎస్సార్‌సీపీకి 15 మంది కౌన్సిలర్లు ఉన్నారు. దీంతో గెలుపుపై తెలుగుదేశం పార్టీ ధీమా వ్యక్తం చేసింది. చైర్మన్ ఎన్నిక సందర్భంగా పోలీసులు పట్టిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. హిందూపురంలో పోలీస్ 30 యాక్ట్‌తో పాటు 144 సెక్షన్ విధించారు. కాగా మున్సిపల్ చైర్మన్ పదవికి టీడీపీ నుంచి రమేష్ కుమార్, వైఎస్సార్‌సీపీ నుంచి వెంకట లక్ష్మి పోటీ పడ్డారు.

**వైసీపీ ప్రజా విశ్వాసం కోల్పోయింది:ఎంపీ, ఎమ్మెల్యే**

వైసీపీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని హిందూపురం పార్లమెంటు సభ్యుడు బీకే పార్థసారథి, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో వారు పాల్గొని ఓటు వేశారు. ఓటింగ్ అనంతరం మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన టిడి రమేష్‌కు డిక్లరేషన్ పత్రాన్ని అందజేశారు. అనంతరం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారథి, ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ హిందూపురంలో తాము చేస్తున్న అభివృద్ధిని చూసి 13 మంది కౌన్సిలర్లు తమ వార్డుల్లో అభివృద్ధి కోసం టీడీపీలో చేరారని తెలిపారు. వాళ్లు పార్టీ మారిన రోజు పార్టీ నుండి సస్పెండ్ చేసి ఈరోజు కొత్తగా కౌన్సిలర్లకు విప్ జారీ చేయడం అర్థరహితమన్నారు. వైసీపీ విలువలు లేని రాజకీయాలు చేసినందువల్లే ప్రజలు తిరస్కరించారని అన్నారు. గతంలో 151 సీట్లు వచ్చినా ఐదు సంవత్సరాలలో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి కేవలం 11 సీట్లు వచ్చాయంటే మీ నిరంకుశ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని అన్నారు.



## తిరుపతి ఘటనలో గాయపడ్డ బాధితురాలికి రూ.2 లక్షల ఆర్థికసాయం

**◆ టీటీడీ చెక్కు అందించిన ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు**

అనంతపురం (చైతన్యరథం): తిరుపతిలో వైకుంఠద్వార దర్శనం టిక్కెట్ల కౌంటర్ వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాటలో తీవ్ర గాయాలపాలైన బాధితురాలికి మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు ఎం.ఎస్.రాజు ఆర్థికసాయాన్ని టీటీడీ తరపున అందించారు. అనంతపురంలోని తన నివాసంలో సోమవారం కర్నాటక రాష్ట్రం బళ్లారికి చెందిన బాధితురాలు దుర్గమ్మకు ఎం.ఎస్.రాజు టీటీడీ తరపున రూ.2 లక్షల ఆర్థికసాయాన్ని చెక్కు ద్వారా అందించారు. తమను ఆదుకున్న ఏపీ ప్రభుత్వానికి, టీటీడీ పాలకమండలి బోర్డుకి దుర్గమ్మ, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా టీడీపీ ప్రధానకార్యదర్శి శ్రీధర్ చౌదరి పాల్గొన్నారు.

## ప్రజా సేవకుడు కుడా చైర్మన్ ముక్క రూపానందరెడ్డి

**◆బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జ్ రితీష్‌రెడ్డి ప్రశంస**

**◆కుడా చైర్మన్‌ను సన్మానించిన టీడీపీ నేతలు**



బద్వేల్ (చైతన్యరథం): రైల్వే కోడూరు నియోజకవర్గంలో గత కొన్ని సంవత్సరాల నుండి ముక్క చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా ఎంతోమంది అభాగ్యులకు కంటి చూపును ప్రసాదించి నిరుపేద కళ్లల్లో వెలుగులు నింపిన కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ముక్క రూపానందరెడ్డి అభినందనీయుడని బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జ్ రితీష్‌రెడ్డి ప్రశంసించారు. కుడా చైర్మన్ రూపానందరెడ్డి రాజధాని అమరావతికి వెళుతూ సోమవారం బద్వేల్ పట్టణంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రితీష్‌రెడ్డి స్వగృహానికి తేనేటి విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ రితీష్‌రెడ్డి, నియోజవర్గ టీడీపీ సీనియర్ నేత మంచూరు సూర్యనారాయణరెడ్డి కలసి కుడా చైర్మన్ ముక్క రూపానందరెడ్డిని, ఆయన తనయుడు ముక్క విశాల్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం రితీష్ రెడ్డి మాట్లాడుతూ కుడా చైర్మన్ ముక్క రూపానందరెడ్డి మంచితనానికి మారుపేరు అని కొనియాడారు. ఈయన పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్నారని, రైల్వే కోడూరు టీడీపీ ఇన్చార్జిగా ఉంటూ కూటమి అభ్యర్థి విజయానికి ఎనలేని కృషి చేశారని ప్రశంసించారు. ప్రతిఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకొని పార్టీ కోసం పని చేస్తే భవిష్యత్తులో ఇలాంటి పదవులు ఎన్నో పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి, శివయ్య స్వామి, ఎల్ఐసి చైర్మన్ రమణారెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి, మండల క్రియాశీల నాయకులు అరవ శ్రీనివాసులు రెడ్డి, కళాశాల ఏవో సుధాకర్‌రెడ్డి, లాయర్ ప్రసాదు, నరసింహనాయుడు, బుజ్జి, విజయ్, రమణారెడ్డి, సాంబశివారెడ్డి, సుబ్బరాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు.

# మాటిచ్చాను.. రోడ్డు వేసే గ్రామంలో అడుగుపెట్టాను

**◆ఎమ్మెల్యే పరిటాల సునీత స్పష్టీకరణ**

**◆నాగసముద్రంలో రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే**

రాప్తాడు (చైతన్యరథం): ఎన్నికల ముందు ప్రచారం సమయంలో మీ ఊరికి రోడ్డు వేసిన తర్వాతే మళ్లీ గ్రామంలో అడుగు పెడతానని మాట ఇచ్చాను.. ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు వేసిన తర్వాతే గ్రామంలో అడుగు పెట్టానని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. చెన్నేకొత్తపల్లి మండలం నాగసముద్రం గ్రామంలో నూతనంగా నిర్మించిన రోడ్డును సోమవారం ఆమె ప్రారంభించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే పరిటాల సునీతకు గ్రామస్తులు కనీవినీ ఎరుగని రీతిలో స్వాగతం పలికారు. గ్రామంలో రెండు కిలోమీటర్ల మేర నూతనంగా నిర్మించిన రోడ్లపై ముగ్గులు వేసి అందంగా అలంకరించారు. ముందుగా గ్రామానికి వచ్చిన పరిటాల సునీతకు పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. అనంతరం ఆమెను ఎడ్ల బండిపై గ్రామానికి తీసుకొచ్చారు. మొత్తం రెండు కిలోమీటర్ల మేర ఎడ్ల బండిపై రాగా.. అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ.. టపాసులు పేలుస్తూ, సన్మానాలు చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.



రోడ్డు ప్రారంభోత్సవం అనంతరం ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ గ్రామస్తుల ఆనందం చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. వాస్తవంగా ఎన్నో ఏళ్లుగా ఈ గ్రామానికి రోడ్డు లేదని.. ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. 2018లో తాను మంత్రిగా ఉన్న సమయంలో ఆర్.ఆర్ గ్రాంట్ కింద తారు రోడ్డు మంజూరు చేశామన్నారు. 2018 ఫిబ్రవరిలో పని కూడా మొదలు పెట్టి.. రెండు కిలోమీటర్లు మెటల్ వేశామని, మూడు కల్వర్టులు పూర్తి చేసినట్లు చెప్పారు. ఆ తర్వాత ఎన్నికలు రావడం ప్రకాష్ రెడ్డి ఎమ్మెల్యే కావడంతో రోడ్డు పనులు అర్ధాంతరంగా ఆపించారన్నారు. అప్పట్లో రోడ్డు కోసం సేకరించిన ఇసుకను కూడా అమ్ముకున్న చరిత్ర వైసిపి వారిదన్నారు. గత ఐదేళ్లలో ఒక్క అడుగు కూడా రోడ్డు వేయని అసమర్థ నాయకుడు ప్రకాష్ రెడ్డి అని విమర్శలు చేశారు. ఎన్నికల ప్రచార సమయంలో వచ్చినపుడు ఇక్కడ గ్రామస్తులు రోడ్డు కావాలని అడిగారని.. మీ ఊరికి కచ్చితంగా ఈసారి రోడ్డు వేసిన తర్వాతే వస్తానని ఆరోజే చెప్పానన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 3నెలలకే మళ్లీ పనులు మొదలుపెట్టామన్నారు. కోటి 42లక్షల ఏపీ ఆర్.ఆర్.పీ గ్రాంటుతో 1.85 కిలోమీటర్లతో రోడ్డు వేశామన్నారు. ఇది ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వమని.. గ్రామంలో ఇంకా చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేయాల్సి ఉందన్నారు. తాను రోడ్డు మీద వచ్చేటప్పుడు ఒకవైపు అందమైన రోడ్డు... ఇంకో పక్క పచ్చటి పొలాలు కనిపిస్తున్నాయంటే.. అది తెలుగుదేశం పార్టీ ఘనతేనన్నారు. నియోజకవర్గంలో గతంలో ప్రకాష్ రెడ్డి ఆపిన రోడ్లన్నీ మళ్ళీ ప్రారంభించామన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా రోడ్డు సమస్య లేకుండా చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే పరిటాల సునీత స్పష్టం చేశారు.

# మహా కుంభమేళాలో తొక్కిసలాట ఘటనపై చర్చించాలి

◆ప్రతిపక్ష ఎంపీల డిమాండ్

◆లోక్‌సభలో గందరగోళం



న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమయ్యాయి. సమావేశాల్లో భాగంగా శనివారం పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. బడ్జెట్ సమర్పించిన అనంతరం ఉభయసభలు సోమవారానికి వాయిదా పడ్డాయి. ఈ నేపథ్యంలో సమావేశాలు ప్రారంభం సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ సందర్భంగా లోక్‌సభలో గందరగోళం నెలకొంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో ఇటీవలే తొక్కిసలాట ఘటనపై చర్చించాలని విపక్ష పార్టీల ఎంపీలు పట్టుబట్టారు. వెల్‌లోకి వచ్చిన విపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది.

మృతుల జాబితాను విడుదల చేయాలని ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని యోగి సర్కార్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఘటన జరిగిన కొన్ని గంటల తర్వాత మరణాలను ధృవీకరించడంపై సందేహం వ్యక్తం చేశారు. మృతుల సంఖ్య మరింత ఎక్కువగానే ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. సభలో ఎంపీల తీరుపై స్పీకర్ ఓం బిర్లా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "ఇక్కడ టేబుల్స్ విరగ్గొట్టేందుకు ప్రజలు మిమ్మల్ని గెలిపించలేదు. మీరు బల్లలు పగలగొట్టడానికే ఇక్కడికి వచ్చిఉంటే.. వాటిని ఇంకా గట్టిగా కొట్టండి" అని విపక్ష ఎంపీలకు స్పీకర్ చురకలు అంటించారు. మరోవైపు రాజ్యసభలో కూడా నిరసనలు వినిపించాయి. తర్వాత విపక్ష ఎంపీలు ఎగువ సభ నుంచి వాకౌట్ చేశారు. సభను సజావుగా నడిపేందుకు ప్రతిపక్షాలు ఇష్టపడటం లేదంటూ మండిపడ్డారు.

# బలవంతపు మత మార్పిడుల కట్టడికి చర్యలు

◆మతం మారితే జైలుశిక్ష, భారీ జరిమానా

◆రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ నిర్ణయం



జైపూర్: బలవంతపు మత మార్పిడులను నిరోధించేందుకు రాజస్థాన్‌లోని భజన్‌లాల్ శర్మ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకోసం బడ్జెట్ సమావేశాల వేదికగా రాజస్థాన్ చట్టవిరుద్ధ మత మార్పిడి నిషేధ బిల్లు 2024 (రాజస్థాన్ ప్రోహిబిషన్ ఆఫ్ అన్ లాఫుల్ కన్వర్షన్ ఆఫ్ రిలిజియన్ బిల్లు 2025) సోమవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టింది. ఈ బిల్లుపై అసెంబ్లీలో చర్చించి ఆమోద ముద్ర వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే గతేడాది అంటే 2024, నవంబర్‌లో ఈ బిల్లు ముసాయిదాను భజన్ లాల్ శర్మ నేతృత్వంలోని కేబినెట్ ఆమోదించిన సంగతి తెలిసిందే.

మత మార్పిడి చేసుకోవాలని నిర్ణయించుకున్న వారు.. దాదాపు రెండు నెలల ముందు జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ క్రమంలో తాము మత మార్పిడి చేసుకోవాలని తాము సొంతంగా నిర్ణయం తీసుకున్నామని జిల్లా ఉన్నతాధికారి ముందు ఒప్పుకోవాల్సి ఉంది. ఇందులో ఎవరి బలవంతం కానీ.. ఎవరి ప్రోద్బలం కానీ లేదని తెలిపాలి. అనంతరం మత మార్పిడికి అనుమతి లభిస్తుంది.

ఇదిలావుండగా రాష్ట్రంలో బలవంతపు మత మార్పిడులు చోటు చేసుకొంటున్నాయంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో వాటిని నిరోధించేందుకు రాజస్థాన్‌లోని బీజేపీ ప్రభుత్వం ఈ తరహా చర్యలు చేపట్టనుంది. ఓ వేళ షెడ్యూల్ కులాలు, తెగలకు చెందిన వారితోపాటు మహిళలు, మైనర్లను బలవంతంగా మత మార్పిడులకు పాల్పడితే.. రెండు నుంచి 10 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ. 25 వేల వరకు జరిమానా సైతం విధించే విధంగా ఈ బిల్లును రూపొందించారు. ఈ బిల్లు ఆమోదం పొందితే.. బలవంతపు మతమార్పిడులకు అడ్డుపడే అవకాశాలు మెండుగా ఉన్నాయనే ఓ చర్చ రాష్ట్రంలో జోరందుకుంది. ఇక ఈ మత మార్పిడి నిరోధక బిల్లుపై రాజస్థాన మంత్రి కె.కె.బిష్ణోయ్ మాట్లాడుతూ.. లవ్ జిహాద్‌కు వ్యతిరేకంగా ఈ బిల్లును ప్రవేశ పెడుతున్నామన్నారు. తద్వారా అమాయక బాలికలను ప్రలోభపెట్టడాన్ని ఆపవచ్చని ఆయన పేర్కొన్నారు.

గతేడాది రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ.. తన ఎక్స్ ఖాతా వేదికగా కీలక ప్రకటన చేశారు. రాజస్థాన్ ప్రభుత్వం అక్రమ మతమార్పిడికి అడ్డుకట్ట వేసేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సీఎంవోలో జరిగిన కేబినెట్ భేటీలో ప్రేరేపించడం లేదా మోసం చేసి మత మార్పిడులు జరిగే ప్రయత్నాలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు అసెంబ్లీలో రాజస్థాన్ చట్టవిరుద్ధ మత మార్పిడి నిషేధ బిల్లు 2024ను ప్రవేశపెట్టాలని నిర్ణయించామన్నారు. ఒక వ్యక్తి చట్టవిరుద్ధ మత మార్పిడి కోసం వివాహం చేసుకుంటే.. అది చెల్లదని ప్రకటించే హక్కు కుటుంబ కోర్టుకు ఉంటుందని సీఎం వివరించారు.

# తొక్కిసలాట దురదృష్టకరం:సుప్రీంకోర్టు

◆మహాకుంభమేళా ఘటనపై పిల్ తిరస్కరణ

న్యూఢిల్లీ: కుంభమేళా తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ ఘటనకు సంబంధించి ఉత్తరప్రదేశ్ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ, దేశవ్యాప్తంగా వచ్చే భక్తుల భద్రత విషయంలో ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలైన పిల్‌ను సోమవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. దీనిపై అలహాబాద్ హైకోర్టుకు వెళ్లాలని సూచించింది.

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా భారీగా భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. సంగం ఘాట్ వద్ద చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనికి ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం బాధ్యత వహించాలంటూ విశాల్ తివారీ అనే న్యాయవాది ఇటీవల సుప్రీంలో పిల్ వేశారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు చోటుచేసుకోకుండా రాష్ట్రాలకు స్పష్టమైన, విధానపరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని అందులో కోరారు. భక్తుల భద్రత ప్రమాదంలో పడకుండా నివారించేలా వీఐపీల కదలికలను ఆపాలని పిటిషన్‌లో ప్రస్తావించారు.



దీనిపై యూపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గా వాదనలు వినిపించారు. ఈ ఘటనపై జ్యుడీషియల్ దర్యాప్తు జరుగుతోందని, ఇదే తరహాలో ఓ పిల్ హైకోర్టులో దాఖలైందని సుప్రీంకు తెలియజేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం ఈ మేరకు తాజా ఆదేశాలు ఇచ్చింది.

## ముగిసిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వం సోమవారం సాయంత్రం ముగిసింది. ఎన్నికల పోలింగ్ ఈనెల 5వ తేదీన జరగనుంది. ఈ ఎన్నికల్లో ప్రధాన పోరు.. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉండనుంది. వరుసగా మరోసారి ఆమ్ ఆద్మీ పార్టీ అధికారాన్ని అందుకోవాలని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. మరోవైపు ఢిల్లీలో ఆప్ పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ భావిస్తోంది. అదీకాక ఈ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు కొద్ది రోజుల ముందు ఆప్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారు. కానీ ఈ ఎన్నికల్లో వారికి టికెట్లు కేటాయించ లేదు. దీంతో వారంతా బీజేపీలో చేరారు.

ఇక ఇండియా కూటమిలో భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు వేర్వేరుగా పోటీ చేస్తున్నాయి.



# 'అద్దాల మేడ' తెరుస్తాం

◆కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ

న్యూఢిల్లీ: కోట్లాది రూపాయల ప్రజాధనంతో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ నిర్మించిన 'అద్దాలమేడ'ను ప్రజా సందర్శన కోసం తెరుస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. రూ.51 వేల కోట్ల ప్రజాధనంతో అద్దాలమేడ (శీష్ మహల్)ను కేజ్రీవాల్ నిర్మించారని అన్నారు. జాంగ్‌పుర అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్‌షా మాట్లాడుతూ, కేజ్రీవాల్‌కు ఒక ఇల్లుతో సంతృప్తి లేకనే 'అద్దాలమేడ' నిర్మించుకున్నారని విమర్శించారు.

'ముఖ్యమంత్రి అయ్యాక ఇల్లు కానీ, కారు కానీ, సెక్యూరిటీ కానీ తీసుకోనని 2013లో కేజ్రీవాల్ చెప్పారు. అయితే ఆ తర్వాత కారు, బంగ్లా తీసుకున్నారు. ఒక బంగ్లాతో ఆయనకు తృప్తి కలగలేదు. దాంతో శీష్ మహల్ నిర్మించారు. అందుకైన రూ.51 వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి? అదంతా ఢిల్లీ ప్రజలకు చెందిన సొమ్ము. శీష్ మహల్‌ను ప్రజాసందర్శన కోసం ఉంచుతామని నేను వాగ్దానం చేస్తున్నాను. కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడిన కేజ్రీవాల్‌కు తిరిగి ఓటు వేసి అధికారం కట్టబెట్టాలా?' అని అమిత్‌షా ప్రశ్నించారు.

### ప్రతాప్‌గంజ్ ప్రజలను మోసం చేసిన సిసోడియా

ప్రతాప్‌గంజ్ ప్రజలను మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా మోసం చేశారని అమిత్‌షా ఆరోపించారు. తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేయడంతో ఎక్కడ ప్రజలు నిలదీస్తారో అనే భయంతో ఆయన ప్రతాప్ గంజ్ నియోజకవర్గాన్ని వదిలిపట్టి జాంగ్‌పురకు వెళ్లిపోయారని అన్నారు. ఇదే సిసోడియా డిప్యూటీ సీఎంగా ఆలయాలు, స్కూళ్లు, గురుద్వారాల సమీపంలో లిక్కర్ దుకాణాలు తెరిపించారని, దేశంలోనే ఒక లిక్కర్ స్కామ్‌లో జైలుకు వెళ్లిన ఏకైక విద్యాశాఖ మంత్రి ఆయనేనని విమర్శించారు. బడే మియా (కేజ్రీవాల్) చోటా మియా (సిసోడియా) కలిసి ఢిల్లీ ప్రజలను వంచించారని మండిపడ్డారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సోమవారం ముగియనుంది. ఈనెల 5న పోలింగ్ జరుగనుండగా, 8న ఫలితాలు వెలువడతాయి.



# వసంత పంచమి వేళ.. భక్త జనసంద్రం.. మహా కుంభమేళా

◆పూలవర్షం కురిపించిన అధికారులు

ప్రయాగ్‌రాజ్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభ మేళ భక్తజన సంద్రమైంది. సోమవారం వసంత పంచమి సందర్భంగా త్రివేణీ సంగమంలో అమృత స్నానాలకు భక్తులు పోటెత్తారు. చివరి అమృత్ స్నానాన్ని ఆచరించేందుకు నాగసాధవులు, స్వామీజీలు, అఖాడాలు భారీగా తరలివచ్చారు. సోమవారం తెల్లవారుజాము నుంచే చలిని సైతం లెక్కచేయకుండా పుణ్యస్నానాలు చేశారు. ఈ సందర్భంగా వారిపై నిర్వాహకులు హెలికాప్టర్ల ద్వారా పూల వర్షం కురిపించారు.

ఇదిలావుండగా ఉదయం 8 గంటల వరకూ దాదాపు 63 లక్షల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ సర్కార్ తెలిపింది. వసంత పంచమిని పురస్కరించుకుని 4 నుంచి 6 కోట్ల మంది భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. ఈక్రమంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేసింది. మౌని అమావాస్య రోజు జరిగిన తొక్కిసలాట ఘటన దృష్ట్యా ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేసింది. మూడంచెల భద్రత నడుమ భక్తులు అమృత స్నానాలు చేస్తున్నారు. బారికేడ్లు ఏర్పాటు చేయడంతోపాటు ఘాట్ల వద్ద సింగల్ లైన్‌లో పంపిస్తున్నారు. అదేవిధంగా ప్రయాగ్‌రాజ్ లోపలికి కార్లను అనుమతించడం లేదు. బయటి రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల కోసం 84 పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### అయోధ్యా నగరికి పోటెత్తిన భక్తులు

అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యకు భక్తులు పోటెత్తారు. సోమవారం వసంత పంచమిని పురస్కరించుకొని రామమందిరం సందర్శన కోసం భక్తులు భారీగా తరలివస్తున్నారు. భక్తుల రాకతో అయోధ్యా నగరి రద్దీగా మారింది. అయోధ్య రాముడి దర్శనానికి గంటల సమయం పడుతున్నట్లు అధికారులు తెలిపారు. భక్తులు రామ్ లల్లాతోపాటు హనుమాన్‌గర్హి ఆలయాన్ని సందర్శిస్తున్నారు. వసంత పంచమి సందర్భంగా బాలరాముడు పసుపు దుస్తుల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఇదిలావుండగా.. వసంత పంచమి నాడు అవధ్‌లో హోలీ వేడుకలు ప్రారంభమయ్యాయి. సాధువులు, భక్తులు ఉత్సాహంగా హోలీ ఆడారు.

## కాఫీ.. 'చేదు'నిజమిదే!

కాఫీ చేదుగా లేకపోయినా.. కొందరికి మాత్రం ఆ భావన కలుగుతుంటుంది. దీనికి కారణాలను జర్మనీ శాస్త్రవేత్తలు వెలుగులోకి తెచ్చారు. కాఫీ సేవించే వ్యక్తి జన్యు లక్షణాలు ఇందుకు దోహదపడుతున్నట్టు తేల్చారు. పరిశోధనలో భాగంగా కాఫీయా అరబికా మొక్క నుంచి సేకరించిన గింజలను శాస్త్రవేత్తలు రోస్ట్ చేశారు. వాటిని పొడిగా మార్చి, కాఫీని తయారుచేశారు. కాఫీలోని కెఫీన్ చాలా చేదుగా ఉంటుందన్నది తెలిసిందే. అయితే దీన్ని తొలగించిన కాఫీ కూడా చేదుగానే ఉంటోంది. దీన్నిబట్టి రోస్టెడ్ కాఫీలో చేదుకు ఇతర పదార్థాలూ కారణమవుతున్నట్టు స్పష్టమవుతోందని శాస్త్రవేత్తలు తెలిపారు.



ఇందులో మొజాంబి యోసైడ్ కూడా ఉంది. కెఫీన్‌తో పోలిస్తే ఇది 10రెట్లు ఎక్కువ చేదుగా అనిపిస్తుంది. ఇది.. మానవ శరీరంలో చేదుకు సంబంధించిన టీఏఎస్ ఆర్43, టీఏఎస్ఆర్ 46 అనే రెండు రకాల గ్రాహకాలను క్రియాశీలం చేస్తుంది. అయితే కాఫీ గింజలను రోస్ట్ చేసేటప్పుడు మొజాంబియోసైడ్ తీవ్రత గణనీయంగా తగ్గుతున్నట్టు గుర్తించారు. అందువల్ల కాఫీ చేదుగా ఉండటానికి అది స్వల్పంగానే కారణమవుతున్నట్లు గమనించారు. ఈ నేపథ్యంలో రోస్టింగ్‌వల్ల మొజాంబియోసైడ్‌కు సంబంధించిన ఇతరత్రా పదార్థాలు ఉత్పత్తవుతున్నాయా? అన్నది తేల్చాలని శాస్త్రవేత్తలు నిర్ణయించారు. రోస్టింగ్ ప్రక్రియలో మొజాంబియో సైడ్ క్షీణించి.. ఏడు విభిన్న ఉత్పత్తులుగా రూపాంతరం చెందుతున్నట్లు గుర్తించారు.

రోస్టింగ్ ఉష్ణోగ్రత, ఎంతసేపు రోస్ట్ చేశారన్నదాన్ని బట్టి.. వీటి పరిమాణం ఉంటోంది. మొజాంబియోసైడ్ క్రియాశీలం చేసే రుచి రిసెప్టార్లను ఇవి కూడా ఉత్తేజితం చేస్తున్నట్లు తేల్చారు. అయితే కాఫీగా తయారయ్యాక వీటి గాఢత తగ్గుతున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. మొజాంబియోసైడ్, దాని రోస్టింగ్ ఉత్పత్తులకు సంబంధించిన ఒకరకం కాంబినేషన్ కలిగిన కాఫీని తాగిన 11 మంది వాలంటీర్లలో 8మంది మాత్రమే చేదు రుచిని అనుభవించారు. జన్యుపరమైన అంశాలు ఈ రుచి భావనను ప్రభావితం చేస్తున్నట్లు తేల్చారు. టీఏఎస్ 2ఆర్ 43 జన్యురకానికి సంబంధించిన రెండు ప్రతుల్లో వైరుద్యాలు ఇందుకు కారణమవుతున్నట్టు వెల్లడైంది.

## మేం లేకుండా చర్చలా..!

తమకు భాగస్వామ్యం కల్పించకుండా రష్యాతో నేరుగా అమెరికా చర్చలు జరపడంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్ యుద్ధంపై కీవ్ భాగస్వామ్యం లేకుండా జరిగే ఎటువంటి సంప్రదింపులైనా ప్రమాదకరమని హెచ్చరించారు. "అమెరికా–రష్యా మధ్య సంబంధాలు ఉండొచ్చు. కానీ ఉక్రెయిన్ లేకుండా మాట్లాడటమంటే.. అందరికీ ప్రమాదకరమే" అని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. తాను బాధ్యతలు స్వీకరించిన ఆరు నెలల్లోపు యుద్ధాన్ని ముగిస్తానని ట్రంప్ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. యుద్ధం ముగింపుపై ఇప్పటికే రష్యా అధికారులతో మాట్లాడుతున్నామని తాజాగా తెలిపారు. వివరాలను మాత్రం వెల్లడించలేదు.

## పనామా కాల్వపై..

# ట్రంప్ 'పవర్‌ఫుల్' అల్టిమేటమ్



బాధ్యతలు చేపట్టకముందు నుంచే పొరుగు దేశాలపై హెచ్చరికలతో కయ్యానికి కాలు దువ్విన అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇప్పుడు అన్నంత పనీ చేసేలాగే కన్పిస్తున్నారు. ఇప్పటికే కెనడా,మెక్సికో, చైనాలపై సుంకాలతో విరుచుకుపడిన ఆయన.. తాజాగా పనామా కాలువపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కాలువను తిరిగి స్వాధీనం చేసుకుంటామని ఎప్పటినుంచో హెచ్చరిస్తున్న ట్రంప్.. త్వరలోనే ఇందుకు సంబంధించి కీలక పరిణామాలు ఉంటాయన్నారు. బలవంతపు చర్యలు ఉండొచ్చనే సంకేతాలివ్వడం గమ నార్హం. "పనామా కాలువను చైనా పరోక్షంగా నిర్వహిస్తోంది. మేం దాన్ని చైనాకు ఇవ్వలేదు. కానీ, ఒప్పందాన్ని పనామా ఉల్లంఘిస్తోంది. అందుకే కాలువను తిరిగి తీసుకోవాలనుకుంటు న్నాం. లేదా త్వరలోనే దీనికి సంబంధించి శక్తిమంతమైన చర్య ఉండబోతోంది"అని ట్రంప్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అయితే, దీనికి బలగాల అవసరం ఉండకపోవచ్చని అన్నారు.

ఇదిలాఉండగా.. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఆదివారం పనామా అధ్యక్షుడు జోస్‌రౌల్ ములినోతో భేటీ అయిన సంగతి తెలిసిందే. "పనామా కాలువ విషయంలో చైనా జోక్యాన్ని, నియంత్రణను అడ్డుకోవాలి. లేదంటే వాషింగ్టన్ తగిన చర్యలు తీసుకుంటుంది" అని ములినోతో అగ్రరాజ్య విదేశాంగ మంత్రి గట్టిగా చెప్పారు. ఈ భేటీ అనంతరం పనామా అధ్యక్షుడు మాట్లాడుతూ.. "అమెరికా దురాక్రమణకు మేం భయపడబోం" అని తెలిపారు. చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

### చైనా డీల్ నుంచి వెనక్కి..

మరోవైపు చైనా బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్ట్ నుంచి తాము వైదొలుగుతున్నట్లు పనామా అధ్యక్షుడు ప్రకటించారు. ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ములినో నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో చేరేందుకు 2017లో చైనాతో చేసుకున్న ఒప్పందాన్ని తాము పునరుద్ధరించబోమని ఆయన వెల్లడించారు.

పనామా కాలువను 1914లో అమెరికా నిర్మించింది. తర్వాత ఇరుదేశాల మధ్య జరిగిన ఒప్పందం మేరకు 1999 డిసెంబరులో దీన్ని పనామాకు ఇచ్చేసింది. అయితే, అమెరికా వాణిజ్య, నావికాదళ నౌకల నుంచి పనామా దేశం భారీగా ఫీజులు వసూలు చేస్తోందని.. వీటిని తగ్గించాలని ట్రంప్ డిమాండ్ చేశారు. లేదంటే ఆ కాలువను తిరిగి వెనక్కి తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో ఇరుదేశాల మధ్య వివాదం రాజుకుంది.

## నెతన్యాహు సతీమణిపై నేర విచారణ



ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు సతీమణి సారాపై నేర విచారణ చేస్తున్నట్టు ఆదేశ పోలీసులు వెల్లడించారు. నెతన్యాహుకు సంబంధించిన అవినీతికేసులో సాక్షులను బెదిరించారనే అభియోగాలపై ఆమెపై నేర విచారణ మొదలైందని చెప్పారు. విపక్ష నేతకు రాసిన లేఖలో న్యాయశాఖాధికారులు ఈ విషయాలను ధ్రువీకరించారు. నెతన్యాహుపై జరుగుతోన్న అవినీతి కేసులో విచారణకు సంబంధించి కీలక సాక్షిని బెదిరించేందుకు ప్రయత్నించినట్టు అక్కడి మీడియాలో ఇటీవల ఓ కథనం ప్రసారమైంది. అటార్నీ జనరల్‌తోపాటు నెతన్యాహు విరోధులుగా భావించే వారిని వేధించేందుకు ప్రయత్నించినట్టు పేర్కొంది. దీనిపై ప్రతిపక్ష సభ్యురాలు నామా లాజిమీ అడిగిన ప్రశ్నకు.. స్టేట్ అటార్నీ బదులిచ్చింది.

తనకు అనుకూలంగా కవరేజీ ఇచ్చేందుకుగాను కొన్ని మీడియా సంస్థలకు సాయం చేయడంతోపాటు ఓ హాలీవుడ్ ప్రొడ్యూసర్ నుంచి ఖరీదైన బహుమతులు తీసుకొని అతడికి ప్రయోజనం చేకూర్చారని నెతన్యాహుపై ఆరోపణలు వచ్చాయి. వీటికి సంబంధించి మోసం, నమ్మకద్రోహం, అవినీతి ఆరోపణలు.. వేర్వేరు వ్యవహారాలకు సంబంధించి నెతన్యాహుపై విచారణ మొదలయ్యింది. గతంలో వచ్చిన ఆరోపణలను ఖండించినప్పటికీ.. కోర్టు విచారణకు హాజరయ్యారు.




## తప్పిన పెను ముప్పు

### టేకాఫ్ అవుతుండగా విమానంలో మంటలు

హ్యూస్టన్‌నుంచి న్యూయార్క్ వెళ్లే యునైటెడ్ ఎయిర్‌లైన్స్ విమానానికి పెనుముప్పు తప్పింది. జార్జిబుష్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానం టేకాఫ్ అవుతుండగా అకస్మాత్తుగా దాని రెక్కల్లో ఒకదానినుంచి మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది అత్యవసర తలుపును తెరవగా ఇన్‌ఫ్లేటబుల్ సైడ్లు తెరచుకున్నాయి. దీంతో ప్రయాణికులను సురక్షితంగా దించేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఎయిర్‌పోర్టులోని అగ్నిమాపక వాహనాలు మంటలను అదుపుచేశాయి. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని హ్యూస్టన్ ఫైర్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది.

విమాన ఇంజిన్లో సాంకేతిక సమస్య తలెత్తడంతో మంటలు అంటుకున్నాయని అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగిన సమయంలో మొత్తం 104 మంది ప్రయాణికులు, ఐదుగురు సిబ్బంది ఉన్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12.30కు ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయంగా మరోవిమానాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలను ఓ ప్రయాణికురాలు సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అవి వైరల్‌గా మారాయి. ఇటీవల అమెరికాలో రెండు విమానప్రమాదాలు జరగడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈనేపథ్యంలో మరో ప్రమాదం జరగడంతో ఎఫ్ఎఏ ప్రమాదాలకు గల కారణాలపై దర్యాప్తును వేగవంతం చేసింది. జనవరి 30న వాషింగ్టన్ డీసీలో మిలిటరీ హెలికాప్టర్, అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం ఢీకొనడంతో రెండింట్లో ఉన్నమొత్తం 67మంది ప్రాణాలు కోల్పోయారు. ఫిలడెల్ఫియాలోని ఓ మాల్ సమీపంలో మెడికల్ ట్రాన్స్‌పోర్టర్ విమానం కూలిపోవడంతో ఏడుగురు మరణించగా, 19 మంది గాయపడ్డారు.

# అదొక.. మూర్ఖుల సంత!

### యుఎస్ఎయిడ్‌పై మండిపడిన ట్రంప్, మస్క్

యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తీవ్ర విమర్శలు చేశారు. అదో నేర సంస్థ అని మస్క్ దుయ్యబట్టగా.. దానిని రాడికల్ మూర్ఖులు నడుపుతున్నారని ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు.అటువంటి వారిని తొలగించి, సంస్థ భవిష్యత్ కార్యాచరణపై తాను నిర్ణయం తీసుకుంటానని అధ్యక్షుడు వెల్లడించారు.అమెరికా ప్రజలు చెల్లిస్తున్న పన్నులతో యూఎస్ఎయిడ్ విదేశాల అభివృద్ధికి ఆర్థిక సహాయం చేస్తుంటే.వారు ఆ డబ్బుతో కొవిడ్ వంటి ప్రమాదకర వ్యాధులను పుట్టించడానికి పరిశోధనలు చేస్తున్నారని మస్క్ ఆరోపించారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన వెంటనే విదేశాలకు అమెరికా అందించే అన్నిరకాల సాయాన్ని 90రోజుల పాటు సస్పెండ్ చేస్తూ కార్యనిర్వాహక ఆదేశాలపై సంతకం చేసిన విషయం తెలిసిందే. విదేశాలకు అందించే సాయం అమెరికా విధానాలకు అను




గుణంగా ఉందా? లేదా? అనేది వారు సమీక్షిస్తున్న నేపథ్యంలో యూఎస్ఎయిడ్ పనితీరుపై వారు విమర్శలు గుప్పించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

వృథా ఖర్చులను తగ్గించడం, ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులే లక్ష్యంగా ఏర్పడిన డోజ్ విభాగానికి.. వేతనాలకు సంబంధించిన ట్రెజరీ యాక్సెస్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే యూఎస్ఎయిడ్‌కు ప్రభుత్వం నుంచి అందే నిధులపై కత్తెర వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

మరోవైపు దీనిని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కిందకు తీసుకురావాలని ట్రంప్ భావిస్తున్నట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి. కాగా టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌ను ప్రభుత్వానికి సంబంధించిన అన్ని విషయాల్లో భాగం చేయడాన్ని డెమోక్రటిక్ సెనెటర్ క్రిస్ మర్ఫీ ఖండించారు. దేశ రహస్య సమాచారాన్ని మస్క్ చేతిలో పెట్టడం, డోజ్‌కు ఎక్కువ హక్కులు ఇవ్వడం వల్ల జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

### అది 'వన్వే స్టీట్' లాంటిది..

కెనడాపై 25 శాతం సుంకాలు విధిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమర్థించుకున్నారు. అమెరికా విషయంలో చాలా ఏళ్లుగా కెనడా దారుణంగా ప్రవర్తిస్తోందని అన్నారు. 'మా బ్యాంకులను వారు అనుమతించలేదు. వ్యవసాయ ఉత్పత్తులనూ అనుమతించలేదు. కానీ మేం మాత్రం కెనడా నుంచి అన్నీ అనుమతించాం. ఇది వన్ వే స్ట్రీట్‌గా ఉంది' అని ట్రంప్ మండిపడ్డారు. తాము ప్రతి ఏడాది కెనడాకు 200 బిలియన్ డాలర్ల రాయితీ ఇస్తున్నామని.. అయినా దీనివల్ల తమ దేశానికి ఎటువంటి లాభం ఉండట్లేదని పేర్కొన్నారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

చైతన్యరథం

# ఆ ఇద్దరి ఆకాంక్షను నెరవేర్చేందుకు ప్రయత్నించా: అభిషేక్

దూకుడైన ఆటతీరుతో ప్రత్యర్థిని హడలెతిస్తున్న అభిషేక్ శర్మ ప్రస్తుతం భారత క్రికెట్లో ఓ సంచలనం. తాజాగా ఇంగ్లండ్‌పై వేగవంతమైన సెంచరీ (135 పరుగులు: 7 ఫోర్లు, 13 సిక్సులు) బాదాడు. సిక్స్‌ల వర్షం కురిపించాడు. ఇటు బౌలింగ్‌లోనూ రెండు వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తాజాగా తన ఇన్నింగ్స్‌పై అభిషేక్ మాట్లాడుతూ.. తన మెంటార్ యువరాజ్ సింగ్‌తో పాటు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఆకాంక్షను నెరవేర్చేందుకు ప్రయత్నించినట్లు వెల్లడించాడు.

నాదైన రోజున తొలి బంతి నుంచే దూకుడుగా ఆడి పరుగులు రాబడతా. మా కెప్టెన్, కోచ్ మద్దతు అత్యంత కీలకం. ఆ విషయంలో నాకెలాంటి సమస్యా లేదు. ఎప్పుడూ ఇలానే ఆడాలని వారు మద్దతుగా నిలిచారు. ప్రత్యర్థి బౌలర్లు 140–150 కి.మీ వేగంతో బంతులేసేటప్పుడు ఇతరుల కంటే ఒక్క సెకను ముందే సిద్ధంగా ఉండాలని సూచించారు. బంతికి తగినట్లుగానే స్పందించి నా షాట్లను ఆడా. ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్ వేసిన బంతిని (ఆర్చర్ బౌలింగ్లో షాట్‌పై) కవర్ మీదుగా ఆడటం తేలికేం కాదు. ఈ షాట్ నాకెంతో ప్రత్యేకం. అలాగే రషీద్ బౌలింగ్లో సిక్స్‌లు కొట్టడం బాగుంది. స్ట్రెయిట్ డ్రైవ్‌తో సిక్స్ రాబట్టడం



యువరాజ్ వల్లే సాధ్యమైంది. దీని గురించి మాట్లాడుకున్నాం. ఆ షాట్ కొట్టడంతో యువీ సంతోషపడి ఉంటాడనుకుంటున్నా. అతడితోపాటు కోచ్ గంభీర్ కూడా నేను కనీసం 15 ఓవర్ల పాటు క్రీజ్‌లో ఉండాలని కోరుకుంటారు. ఈ మ్యాచ్‌లో దానిని అమలు చేసి చూపించానని అభిషేక్ వెల్లడించాడు. తనకెవరితోనూ పోటీ లేదని.. సహచరులు శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ అండర్ 16 నుంచి ఆడుతున్నట్లు తెలిపాడు.

**ఐదో టీ 20లో మరికొన్ని విశేషాలు**

భారత్ తరపున టీ20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసిన బ్యాటర్‌గా అభిషేక్ శర్మ (135: 54 బంతుల్లో 7 ఫోర్లు, 13 సిక్సులు) నిలిచాడు.

ఒక మ్యాచ్లో అత్యధిక సిక్సులు కొట్టిన భారత బ్యాటర్ కూడా అభిషేక్ శర్మనే. ఈ మ్యాచ్లో 13 సిక్సులు కొట్టాడు. రోహిత్ శర్మ (10)ను అధిగమించాడు.

అంతర్జాతీయ టీ20ల్లో భారత్ సాధించిన అత్యధిక స్కోర్లలో ఇది నాలుగోది. ఇప్పుడీ మ్యాచ్లో 247/9 స్కోరు చేసిన టీమ్ ఇండియా, అంతకుముందు బంగ్లాపై (2024లో) 297/6 స్కోరు సాధించింది.

టీ20ల్లో (పూర్తిస్థాయి సభ్య దేశాలు) రెండో అతిపెద్ద ఓటమిని ఇంగ్లండ్ చవిచూసింది. ఈ మ్యాచ్ లో 150 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. అంతకుముందు (2023) భారత్ చేతిలోనే కివీస్ 168 పరుగుల తేడాతో ఓడింది.

# ఐసీసీ జట్టులో నలుగురు భారత అమ్మాయిలకి చోటు



ఐసీసీ ప్రకటించిన అండర్–19 టీ 20 జట్టులో భారత జట్టు నుంచి నలుగురికి చోటు దక్కింది. మహిళల అండర్–19 ప్రపంచకప్‌లో భారత్ వరుసగా రెండోసారి ఛాంపియన్‌గా అవతరించింది. రెండేళ్ల కిందట తొలి ట్రోఫీని దక్కించుకున్న టీమ్ ఇండియా .. రెండోసారి కూడా కప్పును నిలబెట్టుకుంది. అప్రతిహత విజయాలతో ఫైనల్‌కు చేరిన భారత్.. ఫైనల్లో దక్షిణాఫ్రికాను 9 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. టోర్నీ ఆరంభం నుంచి ఇటు బ్యాటుతో, అటు బంతితో చెలరేగిపోతున్న తెలుగమ్మాయి గొంగడి త్రిష.. ఫైనల్లో (44 నాటౌట్: 33 బంతుల్లో 8 ఫోర్లు) సూపర్ ఇన్నింగ్స్ ఆడింది. బౌలింగ్లోనూ 3 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది. 309 పరుగులతో టోర్నీ టాప్ స్కోరర్‌గా నిలవడమే కాక.. 7 వికెట్లు కూడా తీసిన త్రిషనే 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు కూడా వరించింది. ఈ క్రమంలో టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన ఆటగాళ్లతో ఐసీసీ జట్టును ప్రకటించింది. టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్లో నలుగురు భారత ప్లేయర్లకు చోటు దక్కింది. త్రిషతోపాటు జి.కమలిని, ఆయుషి శుక్లా, వైష్ణవిశర్మ ఈ టీముకు ఎంపికయ్యారు. టోర్నీలో 11 వికెట్లు పడగొట్టిన సౌతాఫ్రికా క్రికెటర్ కైలా రేనెకే కెప్టెన్‌గా మొత్తం 12 మందితో ఐసీసీ జట్టుని ప్రకటించింది.

ఐసీసీ జట్టు ఇదే:

1. గొంగడి త్రిష
పరుగులు: 309, సగటు: 77.25, స్ట్రైక్ రేట్: 147.14, టాప్ స్కోర్: 100 నాటౌట్
2. జెమ్మా బోథా (దక్షిణాఫ్రికా) పరుగులు: 105, సగటు: 26,25, స్ట్రైక్– రేట్: 123.52, టాప్ స్కోర్: 37
3. డేవినా పెర్రిన్ (ఇంగ్లాండ్) పరుగులు: 176, సగటు: 35.20, స్ట్రైక్ రేట్: 135.38, టాప్ స్కోర్: 74
4. జి.కమలిని (భారత్) పరుగులు: 143, సగటు: 35.75, స్ట్రైక్ రేట్: 104,37, టాప్ స్కోర్: 56 నాటౌట్
5. కావోయిమ్ బ్రే (ఆస్ట్రేలియా) పరుగులు: 119, సగటు: 29.75, స్ట్రైక్ రేట్: 96,74, టాప్ స్కోర్: 45
6. పూజ మహతో (నేపాల్) పరుగులు: 70, సగటు: 23,33, స్ట్రైక్ రేట్: 51.85, టాప్ స్కోర్: 70, వికెట్లు: 9, బెస్ట్: 4/9
7. కైలా రేనెకే (కెప్టెన్) (దక్షిణాఫ్రికా) వికెట్లు 11, ఎకానమీ 4.14, బెస్ట్: 3/2
8. కేటీ జోన్స్ (వికెట్‌కీపర్) (ఇంగ్లండ్) ఔట్లు: 9, (క్యాచ్‌లు: 2, స్టంపౌట్లు: 7)
9. ఆయుషి శుక్లా (భారత్) వికెట్లు: 14, సగటు: 5.71, ఎకానమీ: 3.01, బెస్ట్: 4/8
10. చమోడి ప్రబోద (శ్రీలంక) వికెట్లు: 9, సగటు: 6.33, ఎకానమీ: 3.80, బెస్ట్: 3/5
11. వైష్ణవి శర్మ (భారత్) వికెట్లు: 17, సగటు: 4.35, ఎకానమీ: 3.36, బెస్ట్: 5/5
12. నాబిసింగ్ నిని (దక్షిణాఫ్రికా) వికెట్లు: 6, సగటు: 7.33, ఎకానమీ: 4.00, బెస్ట్: 3/4

# గుకేష్‌పై ప్రజ్ఞానంద సంచలన విజయం

**• టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ ఛాంపియన్ షిప్ కైవసం**

విజ్కాంజి (నెదర్లాండ్స్): ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్‌ను గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద ఓడించి సరికొత్త రికార్డ్ సృష్టించాడు. ఈ క్రమంలో గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ –2025 టైటిల్ గెల్చుకుని ఛాంపియన్‌గా నిలిచాడు. ఈ క్రమంలో 2006లో విశ్వనాథన్ ఆనంద్ తర్వాత టాటాలో అత్యున్నత బహుమతిని గెలుచుకున్న మొదటి భారతీయుడిగా ప్రజ్ఞానంద అరుదైన ఘనతను దక్కించుకున్నాడు. టై బ్రేకర్‌లో గుకేష్‌పై



ప్రజ్ఞానంద విజయం సాధించాడు. అంతకుముందు గుకేష్, ప్రజ్ఞానంద తమ చివరిదైన 13వ రౌండ్లో పరాజయం పాలయ్యారు. అర్జున్ ఇరిగేశి చేతిలో గుకేష్ ఓడిపోయాడు. ఇక ప్రజ్ఞానంద.. విన్సెంట్ చేతిలో కంగుతిన్నాడు. 8.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్న గుకేష్, ప్రజ్ఞానంద.. టైటిల్ కోసం టైబ్రేకర్లో తలపడ్డారు. ఇందులో ప్రజ్ఞానంద గెలిచి టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు.

# నా అభిమాన క్రికెటర్ ఎప్పటికీ సచినే

**• బాలీవుడ్ స్టార్ అమిర్‌ఖాన్**

ఐదో టీ20లో భాగంగా ముంబయిలోని వాంఖడే స్టేడియం వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ప్రముఖులు, సెలబ్రిటీలు తరలి వచ్చారు. వీరిలో బాలీవుడ్ స్టార్ ఆమీర్ ఖాన్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఓ పాడ్‌కాస్ట్‌తో ఆయన మాట్లాడారు. టీమిండియా ఆడుతున్న మైదానంలోకి అడుగుపెడితే.. నా మనసులో తెలియని అనుభూతి కలుగుతుంది. నేనూ జట్టులో సభ్యుడిగా భావించుకుంటా. అది నాకు గర్వించదగిన విషయం. 2011 వరల్డ్ కప్ ఫైనల్ ఎప్పటికీ మరిచిపోలేను. భారత్ ఘన విజయం సాధించిన ఆ రోజు ఎంతో ప్రత్యేకం.. అని ఆమీర్ ఖాన్ పంచుకున్నారు. అదే విధంగా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తో తనకున్న అనుబంధాన్ని వివరించారు. సచిన్ రిటైర్ అవ్వడానికి ముందు తను ఆడిన చివరి మ్యాచ్ కి హాజరయ్యా. తన ఆట అద్భుతం అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఎప్పుడూ అతడే తన ఫేవరెట్ క్రికెటర్ అని తెలిపారు. ఆమీర్ ఖాన్‌కు సంబంధించిన ఈ వీడియోను బీసీసీఐ 'ఎక్స్'లో షేర్ చేసింది.



# సంజు చూపుడు వేలికి గాయం

**• 6 వారాలు ఆటకు దూరం**

ఇంగ్లాండ్‌తో ఐదో టీ20 సందర్భంగా భారత వికెట్ కీపర్, బ్యాటర్ సంజు శాంసన్ గాయపడిన సంగతి తెలిసిందే. జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో శాంసన్ చూపుడు వేలికి గాయమైంది. ఆర్చర్



వేసిన ఇన్నింగ్స్ తొలి బంతికి సంజు సిక్సర్ బాదగా.. దాదాపు 150కి.మీ. వేగంతో వచ్చిన మూడో బంతి శాంసన్ చేతి గ్లవుకి తాకింది. దీంతో అతను నొప్పితో విలవిల్లాడాడు. ఫిజియో వచ్చి చికిత్స చేశాడు. శాంసన్ నొప్పితో బాధపడుతూనే అదే ఓవర్లో చివరి రెండు బంతులకు సిక్స్, ఫోర్ బాదేశాడు. మార్క్ వుడ్ వేసిన తర్వాతి ఓవర్లో శాంసన్ వెనుదిరిగాడు. డగౌట్ లోకి వచ్చాక వాపు పెరగడంతో స్కానింగ్ చేయించగా వేలు ఫ్రాక్చర్ అయినట్లు తేలింది. ప్రస్తుతం సంజు తిరువనంతపురంలోని స్వగృహానికి వెళ్లినట్లు తెలుస్తోంది. నేషనల్ క్రికెట్ అకాడమీలో రిహాబిలిటేషన్ పూర్తయిన తర్వాతే అతను తిరిగి ప్రాక్టీస్ మొదలుపెట్టనున్నాడు. ఈ క్రమంలో కేరళ, జమ్ము కశ్మీర్ మధ్య జరగనున్న రంజీ ట్రోఫీ క్వార్టర్స్ మ్యాచ్‌కు దూరం కానున్నాడు.

శాంసన్ కుడి చేతి చూపుడు వేలికి ఫ్రాక్చర్ అయింది. అతను మళ్లీ యథావిధిగా ప్రాక్టీస్ ప్రారంభించేందుకు 5–6 వారాల సమయం పడుతుంది. కాబట్టి ఫిబ్రవరి 8 నుంచి పుణె వేదికగా జరగనున్న కేరళ, జమ్మూ కశ్మీర్ రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో అతను ఆడే అవకాశం లేదు. పరిస్థితులను బట్టి చూస్తే శాంసన్ తిరిగి ఐపీఎల్ 2025 సీజన్ తో పునరాగమనం చేసే అవకాశాలున్నాయని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 6 నుంచి ఇంగ్లాండ్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్, తర్వాత జరిగే ఛాంపియన్స్ ట్రోఫీకి శాంసన్ ఎంపిక కాని విషయం తెలిసిందే.




# చేనేత కళాకారులపై సినిమా..

భూదాన్ పోచంపల్లికి చెందిన దర్శకుడు బడుగు విజయకుమార్ చేనేత కళాకారుల జీవితం ఆధారంగా తెరకెక్కించిన చిత్రం 'ది అవార్డ్ 1996'. కష్టించే కళాకారులు దళారుల చేతుల్లో ఎలా మోసపోతున్నారన్నదీ ప్రధానంగా చూపించనున్నారు. శివరామ్ రెడ్డి, మన్నె సాయిచందన రెడ్డి, మాచర్ల కృష్ణ తదితరులు ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రముఖ నిర్మాత సురేశ్ బాబు ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్ ఆకట్టుకుందంటూ చిత్ర బృందాన్ని అభినందించారు. "చేనేత కళాకారులు, వారి సమస్యలను సమాజానికి చూపించాలనుకోవడం అభినందనీయం" అని సురేశ్‌బాబు వ్యాఖ్యానించారు.



## 'కే-ర్యాంపు'తో వస్తున్నాడు



'క' చిత్రంతో ఘన విజయాన్ని అందుకున్న నటుడు కిరణ్ అబ్బవరం మరో కొత్త సినిమాతో ప్రేక్షకులను అలరించనున్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా జైన్స్ నానీ దర్శకత్వంలో రాజేశ్ దండ నిర్మిస్తున్న చిత్రం.. హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ సినిమాకు 'కే-ర్యాంప్' టైటిల్‌ను ఖరారుచేశారు.ప్రముఖ నిర్మాత దిల్ రాజు ముఖ్య అతిథిగా హాజరై హీరో హీరోయిన్లపై క్లాప్ కొట్టి ప్రారంభించారు. మరో నిర్మాత అనిల్ సుంకర కెమెరా స్విచ్ ఆన్ చేశారు. కేరళ నేపథ్యంలో స్పోర్ట్స్ డ్రామాతో ఈసినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా యుక్తి నటిస్తున్నారు. సీనియర్ నటుడు నరేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

## విలన్‌గానూ వస్తున్నా..

హాస్య నటుడిగా తెలుగు చిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన ప్రముఖ నటుడు బ్రహ్మానందం విలన్ క్యారెక్టర్‌లోనూ తెరపై కనిపించనున్నట్టు చెప్పారు. ఇటీవల తన పుట్టిన రోజు సందర్భంగా మీమర్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఓ మీమర్ అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. విలన్ పాత్రలు పోషించడంపై బ్రహ్మానందం స్పష్టత ఇచ్చారు.



## 'సంజు' అందుకు తీయలేదు..!



బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ జీవితాన్ని ఆధారంగాచేసుకొని తెరకెక్కిన చిత్రం 'సంజు'. రాజ్‌కుమార్ హిరాణీ దర్శకుడు. 2018లో విడుదలైన చిత్రాన్ని ఉద్దేశించి రాజ్‌కుమార్ హీరాణీ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.నిజానిజాలు కప్పిపుచ్చడానికి తాను'సంజు' చిత్రాన్ని తెరకెక్కించలేదన్నారు. సంజయ్ దత్ చేసిన తప్పులను కవర్‌చేసేలా తాను ఈ సినిమాను రూపొందించానని అనడంతనకు నచ్చలేదని తెలిపారు. "సంజయ్‌దత్‌తో రెండు సినిమాలు తెరకెక్కించా. మామధ్య డైరెక్టర్ యాక్టర్ రిలేషన్షిప్ తప్ప మరే స్నేహం లేదు. సినిమా కాకుండా ఇతర విషయాల గురించి ఆయనతో పెద్దగా మాట్లాడింది లేదు. సంజయ్ పెరోల్స్‌పై బయటకు వచ్చినప్పుడు ఆయన ఒంటరిగా ఫీలయ్యారు. ఎవరూ ఆయనతో పెద్దగా మాట్లాడేవారు కాదు. ఓసారి నాకు ఫోన్ చేశారు. వీలుంటే కలవమని అన్నారు. ఆరోజు ఆయన నాతో ఎన్నో విషయాలు పంచుకున్నారు.తన తండ్రి గురించి చెప్పారు. అక్కడినుంచి వచ్చాక కూడా ఆయన గురించే నా ఆలోచనలు. ఆయన ఫోన్ చేసినప్పుడల్లా వెళ్లేవాడిని.. ఆయన చెప్పే విషయాలు వినేవాడిని. తర్వాత ఆయన స్నేహితులు, కుటుంబసభ్యులను కలిసి ఎన్నో విషయాలు తెలుసుకొని సినిమా తెరకెక్కించా"

'సంజు' విడుదలయ్యాక.. నిజానిజాలు కప్పిపుచ్చడానికే నేను ఆ సినిమా తీశానని చాలామంది అన్నారు. అప్పటికే సంజు ఇమేజ్‌పై పడిన ముద్రను చెరిపివేసేలా దానిని రూపొందించానని వ్యాఖ్యలు చేశారు. నిజం చెప్పాలంటే నాకు అలాంటి ఉద్దేశం లేదు. ఈ సినిమాలో ఆయన్ని మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన వ్యక్తిగా చూపించా. అలాగే తన ఫ్రెండ్ ప్రియురాలిపై మనసు పడిన వ్యక్తిగా కూడా చూపించా. అలాంటప్పుడు మీరెలా చెబుతారు నేను ఆయన ఇమేజ్‌పై పడినముద్రను తుడిచివేయడానికే ఆ సినిమా చేశానని..?" అని రాజ్‌కుమార్ ప్రశ్నించారు.'సంజు' చిత్రంలో రణబీర్‌కపూర్ ప్రధాన పాత్ర పోషించారు. సుమారు ఎనిమిదేళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకే పరిమితమైంది.

## గ్యాంగ్‌స్టర్ కథతో.. నాని?

'దసరా'విజయం తర్వాత కథానాయకుడు నాని..దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో వస్తున్న రెండో చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. దీనికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరించనున్నట్టు ఇప్పటికే వార్తలొచ్చాయి. ఈ విషయాన్ని చిత్రబృందం ఆదివారం అధికారికంగా ప్రకటించింది. 'జెర్సీ','గ్యాంగ్‌లీడర్' విజయాల తర్వాత నాని,అనిరుధ్ కాంబోలో రానున్న హ్యాట్రిక్ చిత్రమిది. దీనికోసం దర్శకుడు శ్రీకాంత్ శక్తిమంతమైన లార్జర్ దేన్ లైఫ్ కథను సిద్ధం చేశారు. ఇదొక గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఉండే అవకాశమున్నట్టు తెలుస్తోంది.ఇందులో నాని చాలాకొత్తగా పూర్తి మాస్ లుక్‌లో కనిపించనున్నారు. దీనిలో భాగంగా తన శరీరాకృతిని మార్చుకునేందుకు ఆయన జిమ్‌లో కఠిన కసరత్తులు చేస్తున్నారు. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ మొదలు కానుంది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

## 'త్రివిక్రమ్-బన్నీ' లేటెస్ట్ సినిమా?



కాన్‌స్టార్ అల్లు అర్జున్, త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో కొత్త ప్రాజెక్ట్‌ను ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఐతే, ఈ సినిమా ఎప్పుడు స్టార్ట్ అవుతుంది?, ఎప్పుడు రిలీజ్ కాబోతుంది? అంటూ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ మూవీ ఈ నెలాఖరు నుంచి ప్రారంభం కానున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం బన్నీ న్యూలుక్‌పై త్రివిక్రమ్ కసరత్తులు చేస్తున్నాడని.. పాత్ర గెటప్ అండ్ సెటప్ విషయంపై ఇప్పటికే క్లారిటీ వచ్చిందని అంటున్నారు. కాగా జులాయి, సన్ ఆఫ్ సత్యమూర్తి, మరియు అల వైకుంఠపురములో వంటి సూపర్ హిట్‌ల తర్వాత, అల్లు అర్జున్ -త్రివిక్రమ్ మరోసారి జత కట్టారు. ఈ సినిమాని 300 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కించనున్నారట. మొత్తానికి తమ నాలుగో చిత్రాన్ని త్రివిక్రమ్ -బన్నీ చాలా గ్రాండ్‌గా ప్లాన్ చేశారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ మరియు గీతా ఆర్ట్స్ కలిసి ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మించనున్నాయి. ఈ సినిమాకి సంగీత దర్శకుడు థమన్ సంగీతం అదించబోతున్నాడు.

## ప్రళయకాల రుద్రుడిలా..



మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'కన్నప్ప'. భారీ తారాగణంతో ఈ సినిమా రూపొందుతోంది. ఇందులో ప్రభాస్ ఓకీలక పాత్రలో నటిస్తోన్న విషయం తెలిసిందే. ఆయన పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం తాజాగా పోస్టర్ షేర్ చేసింది. రుద్ర పాత్రలో ప్రభాస్ కనిపించనున్నారని చెప్పింది. "ప్రళయ కాల రుద్రుడు! త్రికాల మార్గదర్శకుడు!! శివాజ్ఞ పరిపాలకుడు!!!" అని టీమ్ పేర్కొంది. ఏప్రిల్ 25న సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. మంచు విష్ణు కలల ప్రాజెక్ట్ ఈ సినిమా. మహాకవి ధూర్జటి రాసిన శ్రీకాళహస్తీశ్వర మహత్యంలోని భక్త కన్నప్ప చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'మహాభారత' సిరీస్‌ని తెరకెక్కించిన ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వంలో ఇది సిద్ధమవుతోంది. ప్రీతి ముకుందన్ కథానాయిక. ఇందులో కీలకమైన పరమశివుడి పాత్రలో బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ నటిస్తున్నారు. భారీ బడ్జెట్, అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో సినిమాను నిర్మిస్తు న్నారు. మొదట ఈ చిత్రాన్ని ప్రకటించినప్పుడు ప్రభాస్- నయన తారలు శివపార్వతులుగా కనిపించనున్నారని టాక్ వినిపించింది. అయితే కాజల్ పార్వతీదేవిగా కనిపిస్తున్నారని చిత్రబృందం అధి కారికంగా ప్రకటించింది. మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, శరత్‌కుమార్, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషిస్తు న్నారు. స్టీఫెన్ దేవస్సే, మణిశర్మ సంగీతం అందిస్తున్నారు. 'కన్నప్ప' చిత్రం అధిక భాగాన్ని న్యూజిలాండ్‌లో చిత్రీకరించారు. అక్కడే సినిమా షూట్ చేయడానికిగల కారణాన్ని చెన్నైలో జరిగిన ప్రెస్‌మీట్‌లో చిత్రబృందం తెలియజేసింది. "ఈ చిత్ర కథ మూడో శతాబ్ద కాలంనాటిది. ఆనాటి ప్రకృతి రమణీయతను చిత్రంలో చూపించాల్సి ఉండటంతో న్యూజిలాండ్‌లో చిత్రీకరణను చేపట్టాం" అని పేర్కొంది.

## కబాలి తెలుగు నిర్మాత ఆత్మహత్య

టాలీవుడ్‌లో మరో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ నిర్మాత కె.పి.చౌదరి (సుంకర కృష్ణప్రసాద్ చౌదరి) ఆత్మహత్యకు పాల్పడ్డారు. గోవాలో ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన మృతిపై పోలీసులు ఆత్మహత్య అని నిర్ధారించడంతో టాలీవుడ్ ఒక్కసారిగా షాక్‌కి గురయ్యింది.

2023లో డ్రగ్స్ కేసులో సైబరాబాద్ పోలీసులు కె.పి.చౌదరిని అరెస్ట్‌చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఆ ఘటన తర్వాత ఆయన తీవ్ర డిప్రెషన్‌లోకి వెళ్లారని..ఈ కారణంతోనే ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. గోవాలో ఓ క్లబ్ స్టార్ట్ చేయాలని ఆయన అక్కడకు వెళ్లారు.కానీ,కొన్ని కారణాలవల్ల అది సాధ్యపడలేదు.

సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన 'కబాలి' చిత్రానికి తెలుగు నిర్మాతగా కె.పి.చౌదరి వ్యవహరించారు. ఆయన గబ్బర్‌సింగ్, సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు, అర్జున్ సురవరం వంటి చిత్రాలను డిస్ట్రిబ్యూట్ కూడా చేశారు. ఆయన మృతిపై టాలీవుడ్‌కి చెందిన ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు.